RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:190 | ఆదివారం | 09 ఆగస్టు 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్న వారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

PRESS

77309 83966 98491 98098



## పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ

- రూ.2.25 కోట్లు అందించాలని కేసీఆర్ నిర్ణయం

**హైదరాబాద్, ఆగస్టు 8 :** అనారోగ్యంతో ఇటీవల మరణించిన నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలనుంది. ఆయన కుటుంబానికి పార్టీ తరపున రూ.2.25 కోట్ల సాయం అందజేయాలని పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య

మిగతా 2వ పేజీలో..

## శ్రీశైలానికి కొనసాగుతున్న వరద



- 2.32 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం
- 876.20 అడుగులకు చేరిన నీటిమట్టం
- పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలో జలాశయం
- విద్యుదుత్పత్తితో సాగర్కు 66,460 క్యూసెక్కుల నీరు విడుదల
- తుంగభద్రకు తగ్గిన వరద.. 72.26 టీఎంసీల నిల్వ

3



# పోలవరం–బనకచర్లకు పొలిటికల్ బ్రేక్?

## చంద్రబాబు వైఫల్యమా... రేవంత్ విజయమా!

- సాంకేతిక, చట్టపరమైన లోపాల సవరణకే కేంద్ర అప్రైజల్ కమిటీ ప్రతిపాదనలు వెనక్కి
- పొరుగు రాష్ట్రాల అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాతే ముందడుగు
- కేంద్రం తిరస్కరణపై కాంగ్రెస్ సంబురాలు

**హైదరాబాద్, ఆగస్టు 8:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలని భావిస్తున్న పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు కేంద్ర పర్యావరణ శాఖ నిపుణుల అప్రైజల్ కమిటీ ప్రతిపాదనలు వెనక్కి పంపడం రాజకీయ దుమారం రేపింది. ఈ పరిణామాన్ని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాధించిన విజయంగా ప్రచారం చేస్తుండగా.. ఏపీలో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ చంద్రబాబు ప్రభుత్వ వైఫల్యంగా విమర్శిస్తోంది. అయితే కేంద్ర కమిటీ నిర్ణయాన్ని నిశితంగా పరిశీలిస్తే.. ఇది ప్రాజెక్టును పూర్తిగా తిరస్కరించడం కాకుండా సాంకేతిక, చట్టపరమైన అంశాలను సరిదిద్ది తిరిగి రావాలన్న సూచనగా కనిపిస్తోంది.

**కేంద్రం నిర్ణయంతో కొత్త చర్చ**

పోలవరం-బనకచర్ల అనుసంధానానికి సంబంధించి ఏపీ ప్రభుత్వం సమర్పించిన ప్రతిపాదనల్లో నీటి లభ్యత, అంతర్రాష్ట్ర ప్రయోజనాలు, పర్యావరణ ప్రభావం వంటి అంశాలపై మరింత స్పష్టత

మిగతా 2వ పేజీలో..

## క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

- తెలంగాణ కోసం కొట్లాడిన మాకు తెలియదు
- నీటి వాటాల విషయంలో తేడా వస్తే తెలంగాణ భగ్గుమంటది
- నీళ్లు ఎత్తిపోయడం కూడా చేతకాని సిఎం రేవంత్ రెడ్డి
- మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2



## యూఏఈ బతుకమ్మ సంబరాలకు కేటీఆర్‌కు ఆహ్వానం

2



## నిరుద్యోగులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

3

- బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు డిమాండ్

## ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు భారీ స్పందన

- 7,340 ఇండ్లకు 35,125 దరఖాస్తులు
- 20 తర్వాత లాటరీ
- హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతం



2



## మహిళా బిల్లుపై మాటల యుద్ధం

- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు రాహుల్ కౌంటర్

4



4

## డిగ్రీతో కాదు.. దేశసేవ కలలతో బయటకు వెళ్లండి

## సల్కం చెరువు కేసులో హైడ్రాకు కోర్టు సెగ

- కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఉన్నతాధికారులకు హైకోర్టు నోటీసులు
- ఆక్రమణలపై చర్యలు తీసుకోవడంలో జాప్యంపై ఆగ్రహం
- 11న తదుపరి విచారణ.. అధికారుల వివరణపై ఉత్కంఠ

3



## హైడ్రా ఉద్యోగాలకు పోటెత్తిన యువత

3

- 150 డ్రైవర్ పోస్టులకు వేలాదిమంది పోటీ



## మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి

2

- మహిళా సాధికారతకు అండగా కాంగ్రెస్
- యూత్ కాంగ్రెస్ నారీ శక్తి అభియాన్ శిక్షణలో మంత్రి సీతక్క

## భూసేకరణ, పునరావాసానికి నిధుల కొరత లేదు



- సాగు నీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల విడుదలకు లైన్ క్లియర్
- మిడ్‌మానేరు ఎడమ కాల్వ పనులు వెంటనే పునఃప్రారంభించాలి
- అనుమతుల పేరుతో పనులు ఆగొద్దు.. కలెక్టర్లకు ఆదేశాలు
- పత్తిపాక డీపీఆర్ నెలాఖరులోగా సిద్ధం
- రోళ్లవాగుకు అటవీ అనుమతులు వేగవంతం చేయాలి
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

3

## రాష్ట్రంలో పెట్టుబడులకు అపార అవకాశాలు

- రూ.3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- వేమో డ్రైవర్‌లెస్ కారులో ప్రయాణం
- ప్రవాసులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

# రాష్ట్రంలో పెట్టుబడులకు అపార అవకాశాలు

**శాన్ ఫ్రాన్సిస్కో, ఆగస్టు 8:**




తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. పరిశ్రమలకు అవసరమైన భూమి, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నిరంతర విద్యుత్ సరఫరా, మెరుగైన మౌలిక సదుపాయాలు రాష్ట్ర బలాలని పేర్కొన్నారు. అమె రికాలోని శాన్ఫ్రాన్సిస్కోలో భారత కాన్సులేట్ జనరల్ (సీజీఐ ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వ హించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బే ఏరియాకు చెందిన తెలుగు ప్రవాసులు, పారిశ్రా మికవేత్తలు, సాంకేతిక నిపుణులు, వృత్తి నిపుణు లతో ఆయన సమావేశమయ్యారు. తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దుతున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. పారిశ్రామిక కారిడార్లు, పార్కుల్లో తయారీ, ఐటీ, జీవశాస్త్రం, స్వచ్ఛ ఇంధనం తదితర రంగాల్లో పెట్టుబడులకు అనువైన భూమి అందుబాటులో ఉందన్నారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వన రులను అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ఇతర విద్యా. సాంకేతిక సంస్థలను బలోపేతం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో పరిశ్రమలకు 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ అందించే సామర్థ్యం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. సంప్రదాయ విద్యుత్ పాటు పునరుత్పాదక ఇంధన వనరు రంగంలోనూ రాష్ట్రం గరిష్ట ప్రగతిని సాధిస్తోందని చెప్పారు. పెట్టుబడిదారు లకు వేగంగా అనుమతులు ఇచ్చేందుకు సింగిల్ విండో విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. అనుమతులకు ఎక్కడా అలస్యం జరక్కుండా పారిశ్రామిక అనుకూల వాతావరణాన్ని కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అత్యాధునిక సాంకేతికత, ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, సుస్థిర పట్టణ ప్రణాళికను సమన్వయం చేస్తూ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచస్థాయి సంస్థలను ఆకర్షించేందుకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుందని చెప్పారు. ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, అధు నాతన తయారీ, నాలెడ్జ్ ఆధారిత పరిశ్రమలపై దృష్టి సారించి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ అభివృద్ధి ప్రయాణంలో తెలంగాణ ప్రవాసులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు సాంకేతికత, ఆవిష్కరణలు, పరిశ్రమల విస్తరణలో భాగస్వాములు కావాలని కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాన్ఫ్రాన్సిస్కోలో వేమో స్వయంచాలక (డ్రైవర్స్) వాహనంలో ప్రయాణించారు. అనంతరం వేమో ప్రతినిధులతో సమావేశమై స్వయంచాలక వాహన సాంకేతికత, దాని నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు, నియంత్రణ విధా నాలపై వివరాలు తెలుసుకున్నారు. హైదరాబాద్ తో పాటు ప్రతిపాదిత ఫ్యూచర్ సిటీలో స్వయంచాలక మొబిలిటీ పరిష్కారాలను ప్రయోగాత్మకంగా అమలు చేసే అవకాశాలపై ఆయన ఆరా తీశారు. ఇందుకు అవస రమైన అధిక రిజల్యూషన్ మ్యాపింగ్, సెన్సార్ అనుకూల రోడ్డు డిజైన్, ప్రత్యేక టెస్టింగ్ కారిడార్లు, డేటా కనెక్టివిటీ, ఏఐ కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల గురించి వేమో ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. స్వయంచాలక వాహనాల ట్రయల్స్, భవిష్యత్ విస్తరణకు అవసరమైన నియంత్రణ, విధానపరమైన చట్రాలపైనా చర్చించారు. నూతన తరం మొబిలిటీ సాంకేతికతను హైదరాబాద్, ఫ్యూచర్ సిటీ పట్టణాభివృద్ధి ప్రణా ళికల్లో అనుసంధానం చేసే అవకాశాలను పరిశీలించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆసక్తి వ్యక్తం చేశారు.

# పోలవరం–బనకచర్లకు పొలిటికల్ బ్రేక్?

**మొదటిపేజీ తరువాయి**

అవసరమని కేంద్ర నిపుణుల కమిటీ భావించినట్లు తెలుస్తోంది. దీంతో ప్రతిపాదనలను వెనక్కి పంపింది. దీంతో ప్రాజెక్టుకు రాజకీయంగా బ్రేక్ పడిందా? లేక అనుమతుల ప్రక్రియలో ఇది సాధారణ దశేనా? అన్న చర్చ మొదలైంది.

**చంద్రబాబు వైఫల్యమా?**

ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించి ముందుకు తీసుకెళ్లాలని ప్రయత్నించిన చంద్రబాబు ప్రభుత్వానికి కేంద్ర కమిటీ నిర్ణయం ఎదురుదెబ్బేనని ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ ఆరోపిస్తోంది. ప్రాథమిక అనుమతులు, సాంకేతిక నివేదికలు, అంతర్రాష్ట్ర అంశాలపై పూర్తి స్థాయి కసరత్తు చేయకుండానే ప్రతిపాదనలు పంపడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శిస్తోంది. భారీ ప్రాజెక్టుకు అవసరమైన అన్ని చట్టబద్ధ ప్రక్రియలను పూర్తి చేసి ఉండాల్సిందని పేర్కొంటోంది.

**రేవంత్ విజయమా?**

మరోవైపు తెలంగాణ కాంగ్రెస్ శిబిరం మాత్రం కేంద్ర నిర్ణయాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వ దౌత్యపరమైన విజయంగా అభివర్ణిస్తోంది. తెలంగాణ ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్న అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లిన అభ్యంతరాల ఫలితంగానే ప్రాజెక్టు ప్రతిపాదనలు



వెనక్కి వెళ్లాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. కేంద్రం నిర్ణయంపై తెలంగాణలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు చేసుకోవడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది.

**పొరుగు రాష్ట్రాల అభ్యంతరాలే కీలకం**

ఈ ప్రాజెక్టు అమలులో తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రయోజనాలు కూడా ముడిపడి ఉన్నాయి. గోదావరి జలాల వినియోగం, ముంపు ప్రభావం, నీటి కేటాయింపులు వంటి అంశాలపై ఆయా రాష్ట్రాల అభ్యంతరాలను పరిష్కరించాల్సి ఉంటుంది. అంతర్రాష్ట్ర జల వివాదాలకు సంబంధించిన చట్టాలు, ఒప్పందాల ప్రకారం ప్రభావిత రాష్ట్రాల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ప్రాజెక్టు అనుమతుల ప్రక్రియ ముందుకు సాగాల్సి ఉంటుంది.

**200 టీఎంసీల తరలింపే లక్ష్యం**

గోదావరి నుంచి సుమారు 200 టీఎంసీల వరద నీటిని రాయలసీమకు తరలించడం పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. దీని ద్వారా దాదాపు 80 లక్షల మందికి తాగునీరు, సుమారు 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. ఇంత భారీ ప్రాజెక్టుకు నీటి లభ్యతపై శాస్త్రీయ ధ్రువీకరణతో పాటు పర్యావరణ, అంతర్రాష్ట్ర అనుమతులు తప్పనిసరి.

**తిరస్కరణ కాదు.. సవరణకు అవకాశం**

కేంద్ర అప్రైజల్ కమిటీ ప్రతిపాదనలు వెనక్కి పంపినంత మాత్రాన ప్రాజెక్టు శాశ్వతంగా నిలిచిపోయినట్లు కాదని నిపుణుల అభిప్రాయం. సీడబ్ల్యూసీ నుంచి నీటి లభ్యతపై స్పష్టత, ముంపు ప్రభావంపై సమగ్ర అధ్యయనం, పొరుగు రాష్ట్రాలతో సంప్రదింపులు, అవసరమైన చట్టబద్ధ అనుమతులు పూర్తి చేసి సవరించిన ప్రతిపాదనను మళ్లీ సమర్పించే అవకాశం ఉంటుంది.

**రాజకీయ క్రెడిట్ వార్..**

**ప్రాజెక్టు భవిష్యత్తు ఏంటి?**

ప్రస్తుతం చంద్రబాబు వైఫల్యమా.. రేవంత్ విజయమా అన్న రాజకీయ చర్చ వేడెక్కినా, అసలు ప్రశ్న మాత్రం పోలవరం-బనకచర్ల అనుసంధానం చట్టబద్ధంగా ఎప్పుడు ముందుకు సాగుతుందన్నదే. సాంకేతిక లోపాలను సరిదిద్ది, అంతర్రాష్ట్ర అభ్యంతరాలను పరిష్కరించి, అన్ని అనుమతులు సాధిస్తేనే ఈ ప్రాజెక్టుకు శాశ్వత భవిష్యత్తు ఉంటుంది. రాజకీయంగా ఎవరు క్రెడిట్ తీసుకున్నా.. తుది నిర్ణయం మాత్రం చట్టబద్ధమైన అనుమతులపైనే ఆధారపడి ఉంటుంది.

# మహిళలు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలి

**ఢిల్లీ, ఆగస్టు 8 :**

మహిళల రాజకీయ భాగస్వామ్యమే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. మహిళలు కేవలం ఓటర్లుగా కాక దేశ భవిష్యత్తుకు నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగా నిలిచిందన్నారు. ఢిల్లీలోని యూత్ కాంగ్రెస్ నారీ శక్తి అభియాన్ శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. రాజకీయాల్లో మహిళల పాత్ర, మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వాల కృషి, నిర్ణయాత్మక శక్తిగా మహిళలు ఎదగడంలో కాంగ్రెస్ పాత్ర, ఆన్‌లైన్ యుగంలో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు వంటి అంశాలపై కీలక ఉపన్యాసం చేశారు. మహిళల అభివృద్ధి లేకుండా దేశ అభివృద్ధి సాధ్యం కాదని సీతక్క అన్నారు. మహిళల హక్కులు, సమాన అవకాశాలు, రాజకీయ భాగస్వామ్యం కోసం కాంగ్రెస్ పార్టీ చారిత్రకంగా పోరాడిందని తెలిపారు. మహిళలకు సమానావకాశాలు కల్పించడం కేవలం సంక్షేమ కార్యక్రమం కాదని, అది సామాజిక న్యాయానికి, ప్రజాస్వామ్యానికి పునాది అని అన్నారు. దేశంలో మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలకు ఓటు హక్కు రావడంతోనే సమానత్వం పూర్తికాదని, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం, విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యం, ప్రభుత్వాలను నడిపించే అవకాశం కూడా సమానంగా ఉండాలని అన్నారు. మహిళలు రాజకీయాల్లోకి వస్తే వారి దృష్టి రోడ్లు, భవనాలపై ఉండదని, పిల్లల విద్య, తల్లుల ఆరోగ్యం, తాగునీరు, అంగన్‌వాడీ కేంద్రాలు, పోషకాహారం, గ్రామీణ జీవనోపాధులు, మహిళల ఆర్థిక స్వావలంబన వంటి అంశాలకు మహిళా నాయకత్వం ప్రాధాన్యత ఇస్తుందని చెప్పారు. తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ మారుమూల అడవుల్లో, గిరిజన ప్రాంతాల్లో ప్రజలతో కలిసి పని చేసిన అనుభవం మహిళల రాజకీయ భాగస్వామ్యం ఎంత అవసరమో తనకు నేర్పిందన్నారు. అవకాశాలు కల్పిస్తే మహిళలు నాయకత్వంలో అద్భుతంగా రాణించగలరని చెప్పారు. ఆన్‌లైన్ యుగంలో మహిళలు ఎదుర్కొం టున్న సవాళ్లపై మంత్రి సీతక్క తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు ప్రజా సమస్యలను లేవనెత్తినప్పుడు వారి వాదనలకు సమాధానం చెప్పకుండా వ్యక్తిగత దూషణలు, ట్రోలింగ్, అసభ్యకర వ్యాఖ్యలు, తప్పుడు ప్రచారం, మార్ఫింగ్, బెదిరింపులకు పాల్పడటం ఆందోళనకరమని అన్నారు. మహిళల గొంతును అణచివేసే డిజిటల్ వేధింపులు కేవలం ఒక మహిళకు ఎదురవుతున్న సమస్య కాదని, అది ప్రజాస్వామ్యానికి ఎదురవుతున్న సవాలని సీతక్క అన్నారు. ఇలాంటి దాడులు రాజకీయాల్లోకి రావాలనుకునే యువతులను కూడా వెనక్కి లాగే ప్రమాదం ఉందని తెలిపారు. రాజకీయ విభేదాలు విధానాలపై ఉండాలి కానీ వ్యక్తులపై కాదని స్పష్టం చేశారు. మహిళలపై ఆన్‌లైన్ వేధింపులకు పాల్పడే సంస్కృతిని అడ్డుకోవాల్సిన బాధ్యత పార్టీలు, మీడియా, డిజిటల్ వేదికలు, పౌర సమాజంపై ఉందన్నారు. తెలంగాణలో మహిళా స్వయం సహాయక సంఘాల విజయాలను ఈ సందర్భంగా మంత్రి సీతక్క ప్రస్తావించారు. చిన్న పొదుపులతో ప్రారంభించిన మహిళలు నేడు వ్యాపారవేత్తలుగా ఎదిగి ప్రభుత్వ కార్యక్రమాల అమలులో భాగస్వాములుగా మారారని చెప్పారు. పాఠశాల యూనిఫామ్‌ల తయారీ నుంచి గ్రామీణ జీవనోపాధుల బలోపేతం వరకు మహిళలు తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని తెలిపారు.

# పెద్ది కుటుంబానికి బీఆర్ఎస్ అండ

**మొదటిపేజీ తరువాయి**

నేతలతో కేసీఆర్ చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం రూ.25 లక్షలను ఆమె పేర బ్యాంకులో జమ చేయాలని కూడా కేసీఆర్ నిర్ణయించారు. అంతేగాక పిల్లల భవిష్యత్తు, వారి చదువు, కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని అధినేత తెలిపారు. కాగా, సుదర్శన్ రెడ్డి దశదిన కర్మల కార్యక్రమాలు ముగిసిన తర్వాత పార్టీ జిల్లా ముఖ్యులు సమావేశమై వారి కుటుంబ సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారనీ, ఎల్లకాలం వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

**రేపు పెద్ది కుటుంబ సభ్యులకు కేసిఆర్ పరామర్శ**

నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని నల్లబెల్లికి కేసిఆర్ ఆదివారం వెళ్లి పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ తన ముఖ్య అనుచరుడుగా కొనసాగిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో విషాదంలో ఉన్న అధినేత కేసిఆర్ తన ఆప్తుని కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. ఈ సందర్భంగా ఇంటి పెద్దను కోల్పోయి శోక తప్త హృదయులైవున్న పెద్ది కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కష్టకాలంలో ఉన్న వారికి భరోసా ఇవ్వనున్నారు. ఇదే సందర్భంలో పార్టీ నియోజకవర్గ నాయకులకు, కార్యకర్తలకు, పెద్ది అభిమానులకు అధినేత కేసిఆర్ గుండె ధైర్యం నింపనున్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల టవర్స్‌కు భారీ స్పందన

- **7,340 ఇండ్లకు 35,125 దరఖాస్తులు**
- **మరో రెండు రోజులు మాత్రమే గడువు**
- **20 తర్వాత లాటరీ**
- **హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతం**

**హైదరాబాద్, ఆగస్టు 8 :**

అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో పేదలకు అల్పాదాయ వర్గాలకు సొంతి ఇల్లు కల్పించాలన్న లక్ష్యంతో హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో నిర్మించనున్న ఫ్లాట్లకు భారీ సంఖ్యలో దరఖాస్తులు వస్తున్నాయి. పైలట్ ప్రాజెక్టుగా ప్రతి నియోజకవర్గంలో 500 ఇండ్ల చొప్పున నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 16 అసెంబ్లీ నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న 7,340 ఇండ్ల కోసం డిమాండ్ సర్వే ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తుండగా శనివారంనాటికి 35,125 దరఖాస్తులు వచ్చాయని, ఈ నెల 10వరకు దరఖాస్తు చేసుకోవచ్చని హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎంతో విలువైన భూముల్లో నిర్మిస్తున్న ఈ ఇండ్లను కేవలం నామమాత్రపు ధరకే అందిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో రూ.30 నుంచి రూ.58 లక్షల వరకు ధర పలికే ఈ ఫ్లాట్లను ప్రజల సంక్షేమం కోసం వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచాలన్న ఉద్దేశంతో కేవలం రూ.6 లక్షలకే ప్రభుత్వం కేటాయిస్తున్నదని తెలిపారు. ఇండ్లు పొందిన వారికి రిజిస్ట్రేషన్ చేస్తామని వివరించారు. ప్రజలు సొంత ఇంటి కోసం తాము నివసిస్తున్న ప్రాంతాల నుంచి వలస/తరలివెళ్లకుండా ప్రస్తుతం వారు ఉంటున్న నియోజకవర్గంలోనే సొంత ఇంటిని పొందే అవకాశం ఈ పథకం ద్వారా లభిస్తుందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ఇలాంటి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. దరఖాస్తు సమయంలో ఎలాంటి కుల, ఆదాయ సర్టిఫికెట్లు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. ఇండ్లు రాని పక్షంలో దరఖాస్తుదారులు చెల్లించిన ధరావతు ఫీజు రూ.10వేలు తిరిగి చెల్లిస్తామని ఆయన స్పష్టం చేశారు. దరఖాస్తులను సమర్పించడానికి మరో రెండు రోజులు మాత్రమే గడవు ఉన్నందున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**20 తరువాత లాటరీ..**

**ఏడాదిలోగా నిర్మాణాలు పూర్తి**

ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తూనే మరోవైపు ఇండ్ల కేటాయింపు, నిర్మాణాలకు సంబంధించిన కార్యాచరణపై కూడా హౌసింగ్ బోర్డు చర్యలు తీసుకుంటున్నది. ఇండ్ల కేటాయింపు లాటరీ ప్రక్రియను ఈ నెల 20 నుంచి చేపట్టాలని ప్రాథమికంగా నిర్ణయించారు. అంతేకాక ఆయా ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ నిర్మాణ పనులను చేపట్టడానికి టెండర్ ప్రక్రియను కూడా చేపట్టింది. ఈ ఇండ్లన్నింటినీ ఒక ఏడాదిలోపే పూర్తి చేసి లబ్దిదారులకు అందించేలా పకడ్బందీ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు గౌతం వెల్లడించారు.

**నియోజకవర్గాలవారీగా దరఖాస్తులు**

ఖైరతాబాద్ 4,394, అంబర్‌పేట 2,357, బహదూర్‌పుర1,135, ఇబ్రహీంపట్నం749, కూకట్‌పల్లి5,233, కార్వాన్1,574 మహేశ్వరం471, మలక్‌పేట2,846, మల్కాజిగిరి1,033, మేడ్చల్1,153, నాంపల్లి3,613, సనత్‌నగర్1,046, కుత్బుల్లాపూర్4,121, రాజేంద్రనగర్1,496, సికింద్రాబాద్ కంటోన్మెంట్1,374, శేరిలింగంపల్లి2,530మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందిరమ్మ టవర్స్‌కు సంబంధించి సందేహాల నివృత్తికి కాల్ సెంటర్ ఫోన్ 04024603572ను సంప్రదించవచ్చని గౌతం సూచించారు.



# యూఏఈ బతుకమ్మ సంబరాలకు కేటీఆర్‌కు ఆహ్వానం

- **అక్టోబర్ 11న దుబాయ్ అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్‌లో వేడుకలు**
- **కార్మికుల సమస్యలపై ఈటీసీఏ ప్రతినిధులతో కేటీఆర్ చర్చ**

**హైదరాబాద్, ఆగస్టు 8 :**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈటీసీఏయూఏఈ) ప్రతినిధులు ఆహ్వానించారు. ఈమేరకు కేటీఆర్ నివాసంలో శుక్రవారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన చేతుల మీదుగా విడుదల చేశారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో పదహారేళ్లుగా యూఏఈలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామని, తెలంగాణ సంస్కృతీసాంప్రదాయాలకు అద్దం పట్టేలా ఏటా బతుకమ్మతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈసారి అక్టోబర్ 11న దుబాయ్‌లోని అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

**గల్ఫ్ కార్మికుల పరిస్థితులపై ఆరా**

ఈ సందర్భంగా గల్ఫ్‌లోని తెలంగాణ కార్మికుల పరిస్థితులు, ఉపాధి అవకాశాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై కేటీఆర్ ఆరా తీశారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్నప్పటికీ తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈటీసీఏ ప్రతినిధులను కేటీఆర్ అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పడంలో ప్రవాస తెలంగాణ సంఘాల కృషి అభినందనీయమన్నారు. ఈటీసీఏ కేవలం సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా గల్ఫ్ కార్మికుల కష్టనష్టాల్లోనూ అండగా నిలుస్తూ ఇబ్బందుల్లో ఉన్న తెలంగాణ బిడ్డలకు సహాయసహకారాలు అందిస్తున్న తీరు గొప్పదని కేటీఆర్ అన్నారు. గల్ఫ్‌లో తెలంగాణ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే గల్ఫ్ దేశాల్లో వివిధ కారణాలతో చిక్కుకుపోయిన పలువురు తెలంగాణవాసుల సమస్యల పరిష్కారానికి కేటీఆర్ వ్యక్తిగతంగా ప్రత్యేక చొరవ చూపి వారిని స్వస్థలాలకు చేరుకునేలా చేసిన విషయాన్ని ఈటీసీఏ ప్రతినిధులు ఈ సందర్భంగా గుర్తు చేస్తూ కేటీఆర్ సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

# క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు

**హైదరాబాద్, ఆగస్టు 8 :**

క్షుద్ర పూజలు అని చెప్పి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం.. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వాళ్లం.. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం తమకు లేదని అన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటామన్నారు. హరీష్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా? కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్‌లనూ ధ్వంసం చేసి వోట్లు దండుకోవాలని చూడలేదని ఆరోపించారు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి బీఆర్ఎస్‌ది కాదన్నారు. కరెంటు ఉండి కూడా వ్యవసాయదారుడికి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి. కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజూ కరెంట్ కోతలు అవుతున్నాయని విమర్శించారు. కోర్టులు చెప్పినా హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని ప్రజాస్వామిక వాదులు గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనా విధానాన్ని గుర్తించాలని, రేవంత్ రెడ్డి హిట్లర్ అని చెప్పుకున్నట్లే రాజ్యాంగ వ్యవస్థలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇవ్వలేదని, పైగా వేలాది మంది ఇళ్లను కూలగొట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ లోని 10,000 ఎకరాల విలువైన భూమి పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి చేస్తున్న 5 లక్షల కోట్ల స్కామ్ పైన రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేబులో వేసుకుంటుందో ప్రజలందరికీ అర్థమయ్యేలా లేఖల రూపంలో, ప్రజెంటేషన్ ల రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని తెలిపారు. తాము డిమాండ్ చేస్తేగానీ పంప్‌లు ఎందుకు ఆన్ చేయలేదని ప్రశ్నించారు. సీఎంకు ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని విమర్శించారు. హరీశ్‌రావు ఈ విషయంపై ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ అని ఎద్దేవా చేశారు. కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని కేటీఆర్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుపెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన వస్తుందని స్పష్టం చేశారు. వచ్చేవారం జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశం ఎజెండా పూర్తిగా రాష్ట్ర హక్కులను కాలరాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్‌ని సలహాదారుగా పెట్టుకోవడమే ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? చంద్రబాబు చెప్పు చేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు. రేవంత్ రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్‌ని తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు. నార్లాపూర్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామన్నబీఆర్ఎస్ హెచ్చరికలకు ప్రభుత్వం దిగివచ్చి పంపులని ఆన్ చేసిందని వెల్లడించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు నీళ్లు ఇచ్చే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తి పోసుకుంటే ముఖ్యమంత్రికి పట్టింపు లేదు. ప్రధాన ప్రతిపక్షం ముళ్లు తో పొడిస్తేనే ఈ ప్రభుత్వం స్పందిస్తుంది లేదంటే నిద్రపోతున్నదని పేర్కొన్నారు.

# భూసేకరణ, పునరావాసానికి నిధుల కొరత లేదు

**హైదరాబాద్, ఆగస్టు 8:**

రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసంపునర్నిర్మాణం కోసం ప్రాధాన్యత ప్రాతిపదికన రూ.5 వేల కోట్లు సమకూర్చేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. ఇందులో ఇప్పటికే రూ.2 వేల కోట్లు విడుదలయ్యాయని, మిగిలిన రూ.3 వేల కోట్ల విడుదల ప్రక్రియలో ఉందని తెలిపారు. నిధుల కొరత కారణంగా పూర్తికి చేరువలో ఉన్న ఏ సాగునీటి ప్రాజెక్టు కూడా నిలిచిపోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులపై సచివాలయంలో శనివారం నిర్వహించిన సమగ్ర సమీక్షలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, నాలుగు జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

**భూసేకరణకు నిధులు అడగండి..**
**ఆలస్యం చేయొద్దు**

ప్రాజెక్టుల నిర్మాణంలో భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులను సాధారణ పరిపాలనాంశాలుగా చూడకుండా అత్యంత ప్రాధాన్యతాంశాలుగా తీసుకోవాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ఏ ప్రాజెక్టుకు ఎంత నిధి అవసరమో వెంటనే ప్రతిపాదనలు పంపాలని, అవసరమైన ఆర్థిక అనుమతులు, టోకెన్లు పొందడంలో జాప్యం చేయవద్దని సూచించారు. ఇంజినీరింగ్ పనులు కొనసాగుతుండగానే సాధ్యమైన ప్రాంతాల్లో భూసేకరణ, భూ యజమానులకు పరిహారం చెల్లింపు, నిర్వాసిత కుటుంబాల పునరావాస ప్రక్రియను సమాంతరంగా చేపట్టాలని స్పష్టం చేశారు. ఇప్పటికే వేల కోట్ల ల ప్రజాధనం వెచ్చించిన ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తి చేసి వాటి ఫలాలను రైతులకు అందించడంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారని ఉత్తమ్ తెలిపారు.

**మిడ్ మానేరు ఎడమ కాల్వకు మళ్లీ కదలిక**

సుమారు నాలుగున్నరేళ్లుగా నిలిచిపోయిన మిడ్ మానేరు ఎడమ కాలువ మిగులు పనులను తక్షణమే పునఃప్రారంభించాలని మంత్రి ఆదేశించారు. పనులకు అడ్డంకిగా మారిన భూ సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సవరించిన అంచనాలు సిద్ధం చేయడం, భూసేకరణ, టెండర్ల ప్రక్రియ, చట్టబద్ధ అనుమతుల సాధన.. ఇవన్నీ ఒకదాని తర్వాత మరొకటి కాక సమాంతరంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ప్రక్రియల పేరుతో మరోసారి పనులు నిలిచిపోకుండా నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ రూపొందించాలని అధికారులను సూచించారు.

**పత్తిపాకతో 2.40 లక్షల ఎకరాల**
**ఆయకట్టుకు భరోసా**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలంలో ప్రతిపాదించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పత్తిపాక రిజర్వాయర్‌ను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని ఉత్తమ్ ఆదేశించారు. ఈ పథకం ద్వారా కొత్తగా పదివేల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు కాకతీయ ప్రధాన కాల్వలో డి83 నుంచి డి94 వరకు ఉన్న 2.40 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ధర్మపురి, చొప్పదండి, పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం చేకూరనుంది. పత్తిపాక వద్ద 3 టీఎంసీలు లేదా 5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించే రెండు ప్రత్యామ్నాయాలను అధికారులు పరిశీలిస్తున్నారు. లైడార్ సర్వే, డేటా ప్రాసెసింగ్ ఇప్పటికే పూర్తయ్యాయని, బోర్‌హోల్ డ్రిల్లింగ్, ట్రయల్ పిట్స్, జియోటెక్నికల్ పరిశోధనలు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఈ నెలాఖరులోగా డీపీఆర్ సమర్పిస్తామని తెలిపారు.

**రోళ్లవాగు 96 శాతం పూర్తి**

జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టుపైనా మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఇప్పటికే ప్రాజెక్టు పనులు 96 శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం ఉన్న 0.250 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.949 టీఎంసీలకు పెంచి, స్థానిక పరీవాహక ప్రాంతం నుంచి లభించే నీటిని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా చివరి ఆయకట్టులోని దాదాపు 15 వేల ఎకరాలకు సాగునీటి భరోసా కల్పించడం ప్రాజెక్టు లక్ష్యం. మూడు బండ్లు, సర్‌ప్లస్ వీర్, హెడ్ స్లూయిస్‌లు సహా ప్రధాన నిర్మాణాలు దాదాపుగా పూర్తయ్యాయి. అయితే బండ్ 2లో కొంత భాగం అటవీ భూమిలో ఉండటంతో మిగిలిన పనులు అటవీ అనుమతుల కోసం ఎదురు చూస్తున్నాయి. ప్రత్యామ్నాయ అటవీకరణకు అవసరమైన భూమిని ఇప్పటికే గుర్తించడంతోపాటు వన్యప్రాణుల సంరక్షణకు సంబంధించిన మిటిగేషన్ ప్లాన్‌కు ఆమోదం లభించినట్లు అధికారులు వివరించారు. మిగిలిన అనుమతుల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

**ప్రతీ సమస్యకు 'యాక్షన్ పాయింట్'**

ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్, అటవీ, పర్యావరణ అనుమతులపై ప్రత్యేక జాబితా సిద్ధం చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. ఏ ప్రాజెక్టులో ఏ సమస్య ఉంది.. దాని పరిష్కారానికి ఎంత నిధి అవసరం.. ప్రస్తుతం ఏ దశలో ఉంది.. ఎప్పటిలోగా పరిష్కరిస్తారు అనే అంశాలన్నింటినీ స్పష్టంగా నమోదు చేయాలని చెప్పారు. సమీక్షలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన ప్రతి సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని, తదుపరి సమావేశం నాటికి వాటిపై తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. 'భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ లేదా అటవీ అనుమతుల కారణంగా ఏ సాగునీటి ప్రాజెక్టు నిలిచిపోరాదు. వెంటనే ప్రతిపాదనలు పంపండి. నిధులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది.. ప్రాజెక్టులను పూర్తి చేసి నిర్దేశిత ఆయకట్టుకు మరింత ఆలస్యం లేకుండా నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం' అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సమీక్షలో నాలుగు జిల్లాల కలెక్టర్లతో పాటు ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) ఓ.వి.రమేష్‌బాబు, నీటిపారుదల శాఖ జాయింట్ సెక్రటరీ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు ఆటంకాలు**
**లేకుండా చూడాలి : మంత్రి దుద్దిళ్ల**

నీటి పారుదల ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణానికి భూ సేకరణ అడ్డంకిగా మారకుండా చూడాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులను ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. భూసేకరణ ఆలస్యం అవడం, అటవీ భూముల బదలాయింపు వివాదాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని కోరారు. నూతన రోడ్ల నిర్మాణం, దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాల్లోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఇంజనీర్ల కొరత ఉందన్న ఫిర్యాదులు వస్తున్నాయని, డిప్యుటేషన్‌పై వాటిని సాధ్యమైనంత త్వరలో భర్తీ చేయాలని ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జలమయమైన నివాస ప్రాంతాల ప్రజలకు మరొకచోట ఇళ్ల స్థలాలను కేటాయించాలని కలెక్టర్లను ఆదేశించారు. వర్షాకాలంలో పారిశుధ్య కార్యక్రమాలు కుంటుపడితే అంటువ్యాధులు ప్రబలుతాయని హెచ్చరించారు. మున్సిపాలిటీలు, ఎన్టీపీసీ, జెన్కో, సింగరేణి సంస్థలు సమన్వయంతో పనిచేసి శానిటేషన్ పనులను చేపట్టాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకోవాలని సూచించారు.

# నిరుద్యోగులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి

- **బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు డిమాండ్**

**హైదరాబాద్, ఆగస్టు 8 :**

ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకుని ఉద్యోగాలిస్తామని హామీలు గుప్పించిన మీరు ఇప్పుడు ఆ నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకొస్తే వారిపై ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అని అసెంబ్లీలో బీఆర్ ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఓ ప్రకటనలో నిలదీశారు. హైడ్రాలో 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాదిమంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలి వచ్చారని, ఇది నిరుద్యోగుల తప్పా.. లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా అని ఆయన ప్రశ్నించారు. ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో క్రిమినల్ వేస్ట్ అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తుకొస్తోందన్నారు. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం బాధాకరమన్నారు. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు అని అడిగారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి 32 నెలలు దాటింది.. ఆ హామీ ఏమైంది అని అన్నారు రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాదిమంది నిరుద్యోగులు ఇలా క్యూలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా అన్నారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్.. జాబ్ క్యాలెండర్ బోగస్.. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు బోగస్ అని హరీష్‌రావు ఎద్దేవా చేశారు. ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోందని, నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడంతో పీజీ, పీహెచ్‌డీలు చేసిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉద్యోగాలివ్వడం లేదు.. భరోసా ఇవ్వాల్సిన ముఖ్యమంత్రి విద్యార్థులపైనే అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు అని విమర్శించారు. రేవంత్ రెడ్డీ.. హామీలను అమలు చేయాలని నిరుద్యోగులు అడుగుతున్నారు.. ఉద్యోగం అడగడం, ప్రశ్నించడం, ప్రభుత్వాన్ని నిలదీయడం నేరం కాదంటూ ఉద్యోగాలు ఇవ్వలేని ప్రభుత్వం కనీసం ఉద్యోగం కోసం వచ్చిన నిరుద్యోగులను గౌరవించడం నేర్చుకోవాలి అని హితవు పలికారు. నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యార్థి, నిరుద్యోగ లోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

# హైడ్రా ఉద్యోగాలకు పోటెత్తిన యువత

- **150 డ్రైవర్ పోస్టులకు వేలాదిమంది పోటీ**
- **తెల్లవారుజామున 4 గంటల నుంచే అభ్యర్థుల బారులు**
- **సరూర్ నగర్ స్టేడియంలో కిక్కిరిసిన నిరుద్యోగులు**
- **తోపులాటతో రంగంలోకి దిగిన పోలీసులు**
- **టోకెన్లు ఇచ్చి అభ్యర్థులను వెనక్కి పంపిన అధికారులు**

**హైదరాబాద్,ఆగస్ట్ 8:**

నగరంలోని సరూర్ నగర్ స్టేడియం వద్ద తోపులాట జరిగింది. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యో గులు పోటెత్తారు. శనివారం, ఆదివారం డ్రైవర్ల ఎంపిక ఉంటుందని హైడ్రా ప్రకటించింది. దీంతో ఇందులో పాల్గొనేందుకు నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. డ్రైవర్ పోస్టుల కోసం రాష్ట్రంలోని నలుమూల నుంచి వేలాదిమంది నిరుద్యోగ యువత శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే సరూర్ నగర్ స్టేడియానికి భారీగా చేరుకున్నారు. ఊహించని రీతిలో వేలాదిమంది పోటెత్తడంతో స్టేడియం మొత్తం నిరుద్యోగులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత. తోపులాట చోటుచేసుకుంది. గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నప్పటికీ అధికారుల వైపు నుంచి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు కూడా ఏర్పాటు



చేయకపోవడంతో లైన్లలో వేచి ఉన్న యువత.. నిర్వా హకుల తీరుపై ఆందోళనకు దిగారు. ఉద్యోగం కోసం జిల్లాలు దాటి వస్తే అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించారంటూ నిరుద్యో గులు వాపోతున్నారు. వెంటనే స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. అభ్యర్థులకు టోకెన్ ఇచ్చి వెనక్కి పంపినట్లు తెలుస్తోంది. టోకెన్ లో చెప్పిన టైమ్ ప్రకారం అక్కడకు వచ్చి ఈవెంట్స్ లో పాల్గొనాలని నిర్వాహకులు చెబుతున్నారు.

# సల్కం చెరువు కేసులో హైడ్రాకు కోర్టు సెగ

**హైదరాబాద్, ఆగస్టు 8**

హైదరాబాద్‌లో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపే లక్ష్యంగా పనిచేస్తున్న హైడ్రాకు సల్కం చెరువు వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు నుంచి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్ పరిధిలో ఆక్రమణలపై గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడంలో జాప్యం జరిగిందన్న అభ్యంతరాలపై న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌తో పాటు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, నీటిపారుదల, రెవెన్యూ, విద్యాశాఖలకు చెందిన ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది.

**విద్యాసంస్థల నిర్మాణాలపై ఫిర్యాదు**

సల్కం చెరువు పరిధిలోని ఫుల్ ట్యాంక్ లెవల్, బఫర్ జోన్‌ను ఆక్రమించి ఓవైసీకి చెందిన విద్యా సంస్థల భవనాలు నిర్మించారన్న ఆరోపణలతో పిటిషన్ దాఖలైంది. ఈ నిర్మాణాల కారణంగా వర్షాకాలంలో పరిసర ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాటిలైట్ మ్యాప్‌లు, రెవెన్యూ రికార్డుల ఆధారంగా ఆక్రమణలను గుర్తించవచ్చని, అయినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వాదించారు.

**ఆదేశాల అమలులో జాప్యంపై ఆగ్రహం**

సల్కం చెరువు పరిధిలోని ఆక్రమణలపై గతంలోనే చట్టపరమైన చర్యలు చేపట్టాలని హైకోర్టు ఆదేశించినట్లు పిటిషనర్ పేర్కొన్నారు. అయితే ఆదేశాలు వెలువడి నెలలు గడిచినా క్షేత్రస్థాయిలో చర్యలు కనిపించకపోవడంపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. న్యాయస్థానం ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం లేదా అనవసర జాప్యం జరిగితే అది కోర్టు ధిక్కరణ పరిధిలోకి వచ్చే అంశమని స్పష్టం చేసింది.

**అధికారులకు కౌంటర్ దాఖలుకు ఆదేశం**

ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు తమ వివరణను కౌంటర్ అఫిడవిట్ రూపంలో దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. హైడ్రా కమిషనర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. అధికారుల వివరణను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలపై న్యాయస్థానం నిర్ణయం తీసుకోనుంది.

**11న తదుపరి విచారణ**

సల్కం చెరువు కేసు తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. అధికారుల సమాధానాలు, ఇప్పటివరకు తీసుకున్న చర్యల వివరాలను న్యాయస్థానం పరిశీలించనుంది. వివరణలు సంతృప్తికరంగా లేకపోతే కోర్టు ధిక్కరణ చట్టం కింద తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉండటంతో ఈ విచారణపై ఆసక్తి నెలకొంది.

**హైడ్రా తీరుపై మరోసారి చర్చ**

చెరువుల ఆక్రమణల తొలగింపులో హైడ్రా కఠినంగా వ్యవహరిస్తున్నప్పటికీ, ప్రభావవంతమైన వ్యక్తులు లేదా సంస్థలకు సంబంధించిన నిర్మాణాల విషయంలో అదే స్థాయి చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు కొంతకాలంగా వినిపిస్తున్నాయి. సామాన్యుల నిర్మాణాలపై చర్యలు తీసుకుంటూ, పలుకుబడి ఉన్న సంస్థల విషయంలో వెనుకడుగు వేస్తోందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. సల్కం చెరువు వ్యవహారంలో హైకోర్టు జోక్యంతో ఈ విమర్శలు మరోసారి తెరపైకి వచ్చాయి. చట్టం అందరికీ సమానంగా వర్తిస్తుందనే నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు హైడ్రాతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖలపై ఉంది.

# మాయమైన ఐఫోన్.. కనిపించని సూసైడ్ నోట్!

- **ట్రైనీ ఐపీఎస్ అధికారిణి లైంగిక వేధింపుల కేసులో కీలక పరిణామం**
- **కస్టడీలోనూ ఫోన్ ఆచూకీపై స్పష్టత ఇవ్వని ఉదయ్‌కృష్ణారెడ్డి**

**హైదరాబాద్, ఆగస్టు 8**

సహచర మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిపై లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన ఉదయ్‌కృష్ణారెడ్డి వ్యవహారంలో కీలక ఆధారాలు మాయమవ్వడం కలకలం రేపుతోంది. కేసు దర్యాప్తులో కీలకంగా భావిస్తున్న ఆయన ఐఫోన్ ప్రస్తుతం పోలీసులకు అందుబాటులో లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఆ ఫోన్‌లో సూసైడ్ నోట్‌తో పాటు కేసుకు సంబంధించిన ఇతర వివరాలు ఉండే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

**సూసైడ్ నోట్‌పై సజ్జనార్ ప్రశ్నలు**

కస్టడీ విచారణ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ స్వయంగా సూసైడ్ నోట్ విషయమై ఉదయ్‌కృష్ణారెడ్డిని ప్రశ్నించినట్లు సమాచారం. మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో లేఖ రాశానని, అయితే ప్రస్తుతం ఆ లేఖ ఎక్కడ ఉందో తనకు తెలియదని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది.

**ఫోన్ ఎక్కడ?**

సూసైడ్ నోట్ ఉన్నట్లు చెప్పబడుతున్న ఐఫోన్ ప్రస్తుతం కనిపించకపోవడంపై పోలీసులు దృష్టి సారించారు. కేసు విచారణలో డిజిటల్ ఆధారాలు కీలకంగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో ఫోన్ ఆచూకీపై స్పష్టత రావాల్సి ఉంది. ఫోన్‌ను స్వాధీనం చేసుకోలేకపోవడం దర్యాప్తు అధికారులకు సవాలుగా మారింది.

**మరో సెక్షన్ నమోదుకు నిర్ణయం**

విచారణలో పోలీసులను, దర్యాప్తు అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినట్లు నిర్ధారణకు వచ్చిన పోలీసులు ఉదయ్‌కృష్ణారెడ్డిపై మరో అదనపు సెక్షన్ కింద కేసు నమోదు చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. కీలక ఆధారాలను అందించకుండా దర్యాప్తునకు సహకరించకపోవడాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

**కోర్టులో హాజరు**

కస్టడీ గడువు ముగియడంతో ఉదయ్‌కృష్ణారెడ్డికి వైద్య పరీక్షలు నిర్వహించిన పోలీసులు అనంతరం ఆయనను న్యాయస్థానంలో హాజరుపరిచారు. మరోవైపు మాయమైన ఐఫోన్, సూసైడ్ నోట్ ఆచూకీతో పాటు కేసుకు సంబంధించిన డిజిటల్ ఆధారాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## 'రెంట్ బాయ్‌ఫ్రెండ్' ప్రకటనలతో
# సైబర్ మోసాలు

**హైదరాబాద్, ఆగస్టు 8**

'రెంట్ బాయ్‌ఫ్రెండ్' పేరుతో సామాజిక మాధ్యమాల్లో, ఇతర ఆన్‌లైన్ వేదికల్లో చక్కర్లు కొడుతున్న ప్రకటనల పట్ల యువతులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ హెచ్చరించారు. మహిళలు, యువతులను లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ మోసానికి సంబంధించిన వివరాలను తన ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు.

**ఆకర్షణీయమైన ప్యాకేజీలతో వల**

గంటపాటు కాఫీ సమావేశానికి రూ.499, సినిమా డేట్‌కు రూ.1,249, షాపింగ్‌కు రూ.1,499,వివాహాలు,ఇతర శుభకార్యాలకు తోడుగా వచ్చేందుకు రూ.1,999, రోజంతా అందుబాటులో ఉండేందుకు రూ.4,499 అంటూ ఆకర్షణీయమైన ప్యాకేజీలతో ప్రకటనలు ఇస్తున్నారని సజ్జనార్ తెలిపారు. ఇంటర్నెట్ నుంచి సేకరించిన లేదా కృత్రిమ మేధస్సుతో రూపొందించిన యువకుల ఫొటోలను ఉపయోగించి నమ్మించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.

**ముందస్తు చెల్లింపుల పేరుతో మోసం**

ప్రకటనలను చూసి ఎవరైనా సంప్రదిస్తే తొలుత స్నేహపూర్వకంగా మాట్లాడి, ఆ తర్వాత అడ్వాన్స్ లేదా భద్రతా డిపాజిట్ పేరుతో డబ్బులు అడుగుతారని కమిషనర్ వివరించారు. డిజిటల్ వ్యాలెట్లు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా నగదు బదిలీ చేయించిన అనంతరం బాధితులను సంప్రదించకుండా తప్పించుకుంటారని తెలిపారు.

**నేరుగా కలిస్తే మరిన్ని ప్రమాదాలు**

ఆన్‌లైన్‌లో పరిచయమైన వ్యక్తులను నేరుగా కలిసినప్పుడు బ్లాక్‌మెయిల్, బెదిరింపులు, ఇతర భద్రతాపరమైన సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని సజ్జనార్ హెచ్చరించారు. ఇలాంటి ప్రకటనలను నమ్మవద్దని, ఎట్టి పరిస్థితుల్లోనూ ముందుగానే డబ్బులు చెల్లించవద్దని సూచించారు.

**అనుమానాస్పద పోస్టులపై ఫిర్యాదు చేయాలి**

తల్లిదండ్రులు తమ పిల్లల సామాజిక మాధ్యమాల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని సజ్జనార్ సూచించారు. ఎవరైనా ఈ తరహా మోసానికి గురైనా, అనుమానాస్పద ప్రకటనలు కనిపించినా వెంటనే 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ ప్రకటనలపై సైబర్ క్రైమ్ విభాగం ఇప్పటికే విచారణ చేపట్టిందని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

**శ్రీశైలం, ఆగస్టు 8 :**

ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలం ప్రాజె క్టు వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి శ్రీశైలానికి 2,32,308 క్యూసెక్కుల వరద ప్రవహిస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 876. 20 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 169.46 టీఎంసీలకు చేరింది. ఈ క్రమం లో అధికారులు కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రాల్లో ముమ్మరంగా విద్యుదుత్పత్తి చేసి 66,460 క్యూసెక్కుల నీటిని సాగర్కు విడుదల చేశారు. కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,133 క్యూసెక్కుల నీటి ని విడుదల చేయగా, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్కు 8 వేల క్యూసెక్కులు, హంద్రీనీవాకు 875 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాగా, కృష్ణా నదిలో వరద ప్రవాహం పరవళ్లు తొక్కు తున్నా సాగర్కు విడుదల కావడం లేదు. ఒకవైపు కృష్ణా, భీమా నదులు పొంగిపొర్లుతూ శ్రీశైలం వైపు పరుగులు తీస్తుంటే రాష్ట్ర సర్కార్ పాలమూరు ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు నీటిని ఎత్తిపోయకుండా దోబూచులాడుతున్నదన్న విమర్శలు ఉన్నాయి. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి నాలుగు మోటర్లు సిద్ధంగా ఉన్నాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో మరో నాలుగు మోటర్లతో కూడా నీటిని ఎత్తిపోయొచ్చు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రెండు ప్రా జెక్టులకు నీటిని వదలకుండా కృష్ణా జలాలను వృథాగా దిగువకు వదిలిపెడుతున్నదని పాలమూరు నేతలు మండిపడు తున్నారు. ఇదిలా వుంటే తుంగభద్ర జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం ప ట్టిందని టీబీ డ్యాం బోర్డు అధికారులు తెలిపారు. శనివారం ఉద యం 42,114 క్యూసెక్కుల ఇన్ ఫ్లో కొనసాగింది. ప్రస్తుతం డ్యాంలో 1,623.68 అడుగులకు గాను 72.26టీఎంసీల నీటి నిల్వ ఉంద న్నారు. తాగునీటి అవసరాలు కోసం వివిధ కాల్వలకు 1,514 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# 'సర్' రెండో విడతపై దృష్టి సారించాలి

**హైదరాబాద్, ఆగస్టు 8 :**

రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) రెండవ విడత ప్రక్రియపై పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షు ఎన్.రామచందర్ రావు పిలుపునిచ్చారు. ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కన్వీనర్ వేముల అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ఎస్ఐఆర్ ఫేజ్ 2 రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 'సర్' ప్రక్రియ ముగియడానికి కేవలం మరో రెండు రోజులు (ఆగస్టు 10 వరకు) సమయం ఉన్నందున ప్రతీ నియోజకవర్గంలోనూ అర్హులైన ప్రతి ఒక్కరితో ఫాం6 ద్వారా కొత్త ఓటు నమోదు వేగవంతంగా పూర్తి చేయించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ గడువు ముగిసిన తర్వాత కూడా రాబోయే రోజుల్లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ల పరిశీలన, నకిలీ ఓట్ల గుర్తింపు, అభ్యంతరాల దాఖలు వంటి కీలకమైన అంశాలు ఉంటాయని రామచందర్ రావు స్పష్టం చేశారు. ఫాం7 (ఓట్ల తొలగింపు), ఫాం8 (సవరణలు) సరైన రీతిలో దాఖలు చేయడం, నోటీసులకు తగిన ఆధారాలతో లీగల్‌గా సమాధానాలు ఇవ్వడం, పోలింగ్ బూత్‌ల రేషనలైజేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించడంపై బీఎల్‌ఏ1లు, లీగల్ టీమ్స్ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## యూపీ ఎన్నికలపై బీజేపీ ఫోకస్

- **మోదీతో యోగి భేటీ.. త్వరలో నితిన్ నబీన్‌తో సమావేశం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:**

ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో బీజేపీ అధిష్ఠానం ఎన్నికల వ్యూహాలపై దృష్టి సారించింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శనివారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ప్రధాని నివాసంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్రంలో ఎన్నికల సన్నాహాలు, ప్రభుత్వ పనితీరు, కీలక రాజకీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది.

**యోగితో నితిన్ నబీన్ భేటీ**

మోదీతో సమావేశం అనంతరం బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తోనూ యోగి ఆదిత్యనాథ్ భేటీ కానున్నారు. వరుసగా జరుగుతున్న ఈ సమావేశాలతో ఉత్తర్‌ప్రదేశ్ రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. ఎన్నికలకు ముందే పార్టీ, ప్రభుత్వ పనితీరుపై సమీక్ష జరుపుతూ భవిష్యత్ వ్యూహాన్ని ఖరారు చేసే దిశగా అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**2027 ఎన్నికలే లక్ష్యంగా వ్యూహం**

ఉత్తర్‌ప్రదేశ్‌లో 2027 ప్రారంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే వరుసగా రెండుసార్లు అధికారాన్ని దక్కించుకున్న బీజేపీ మూడోసారి కూడా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలోనే ఎన్నికలను ఎదుర్కొనేందుకు పార్టీ వ్యూహాలు సిద్ధం చేస్తోంది.

**2029 లోక్‌సభకు కీలకం**

యూపీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు 2029 లోక్‌సభ ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో బీజేపీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. దేశంలో అత్యధిక లోక్‌సభ స్థానాలు ఉన్న రాష్ట్రం కావడంతో యూపీలో మెరుగైన ఫలితాలు సాధించడం జాతీయ రాజకీయాల్లోనూ కీలకంగా మారనుంది. ఈ నేపథ్యంలో యోగి ప్రభుత్వ పనితీరు, పార్టీ సంస్థాగత బలం, ఎన్నికల వ్యూహాలపై అధిష్ఠానం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోంది.

## యూపీఐపై వినియోగదారులకు ఛార్జీలు లేవు

- **భవిష్యత్తులో ఎంపిక చేసిన వ్యాపార లావాదేవీలపై స్వల్ప ఎండీఆర్**
- **అన్ని యూపీఐ లావాదేవీలపై ఒకే విధమైన రుసుము ఉండదని వెల్లడి**

**న్యూఢిల్లీ, ఆగస్టు 8**

యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధిస్తారన్న ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక స్పష్టత ఇచ్చింది. యూపీఐ ద్వారా చెల్లింపులు చేసే సాధారణ వినియోగదారులపై ఎలాంటి లావాదేవీ రుసుము విధించబోమని శనివారం ప్రకటించింది. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే లావాదేవీలు పూర్తిగా ఉచితంగానే కొనసాగుతాయని స్పష్టం చేసింది. భవిష్యత్తులో కొన్ని పరిమిత వ్యాపార లావాదేవీలపై స్వల్ప ఎండీఆర్ విధించే అవకాశం మాత్రమే ఉందని తెలిపింది.

**పీ2పీ లావాదేవీలకు రుసుము లేదు**

వ్యక్తి నుంచి వ్యక్తికి జరిగే యూపీఐ చెల్లింపులపై ఎలాంటి ఛార్జీలు విధించే ప్రతిపాదన లేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అత్యధికంగా జరిగే సాధారణ వ్యాపార లావాదేవీలపైనా ప్రస్తుతం ఎలాంటి రుసుము ఉండదని పేర్కొంది.

**ఎంపిక చేసిన వ్యాపార లావాదేవీలకే ఎండీఆర్**

భవిష్యత్తులో ఎండీఆర్ విధించే నిర్ణయం తీసుకున్నా.. అది అన్ని లావాదేవీలకు వర్తించదని కేంద్రం స్పష్టం చేసింది. నిర్దిష్ట పరిమితికి మించిన కొన్ని ఎంపిక చేసిన వ్యాపార లావాదేవీలకు మాత్రమే స్వల్ప రుసుము విధించే అవకాశం ఉంటుందని తెలిపింది. ఈ ఛార్జీలు కూడా నామమాత్రంగానే ఉంటాయని పేర్కొంది.

**కార్డు ఎండీఆర్‌తో పోలిస్తే తక్కువ**

భవిష్యత్తులో విధించే అవకాశం ఉన్న ఎండీఆర్.. ప్రస్తుతం డెబిట్, క్రెడిట్ కార్డు లావాదేవీలపై వర్తించే రుసుములతో పోలిస్తే చాలా తక్కువగా ఉంటుందని కేంద్రం వివరించింది. అన్ని యూపీఐ లావాదేవీలపై ఒకే విధమైన రుసుము విధించే విధానం ఉండదని స్పష్టం చేసింది.

**సవరణలపై ఆందోళనల నేపథ్యంలో స్పష్టత**

పేమెంట్ అండ్ సెటిల్మెంట్ సిస్టమ్ చట్టంలో ప్రతిపాదించిన సవరణలపై సాధారణ యూపీఐ వినియోగదారులపై ఛార్జీలు విధించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందన్న ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో కేంద్రం తాజా ప్రకటన చేసింది. ప్రతిపాదిత మార్పులు సాధారణ వినియోగదారుల నుంచి యూపీఐ లావాదేవీ రుసుము వసూలు చేయడానికి ఉద్దేశించినవి కావని స్పష్టం చేసింది.

## కట్టడి చేయండి..

**న్యూఢిల్లీ, ఆగస్టు 8**

సోషల్ మీడియా వేదికలపై డీప్‌ఫేక్‌లు, మార్ఫింగ్ చిత్రాలు, తప్పుడు సమాచారం, ప్రచార కంటెంట్ విస్తరణకు అడ్డుకట్ట వేయాలని కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా మెటా సంస్థ తన అల్గారిథంలను పునఃపరిశీలించి, కంటెంట్ నియంత్రణకు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆదేశించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

**వివాదాస్పద కంటెంట్‌పై ప్రత్యేక దృష్టి**

కేంద్ర ప్రభుత్వ అధికారులు, మెటా సాంకేతిక బృందం మధ్య జరిగిన సమావేశంలో డీప్‌ఫేక్‌లు, మార్ఫింగ్ చేసిన చిత్రాలు, తప్పుడు పోస్టులు, ప్రచార కంటెంట్ వేగంగా వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగినట్లు సమాచారం. అల్గారిథంలలో అవసరమైన మార్పులు చేయడంతో పాటు కంటెంట్ మోడరేషన్‌ను మరింత కఠినతరం చేయాలని అధికారులు సూచించినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల నుంచి వివాదాస్పద కంటెంట్‌ను తొలగించాలంటూ విజ్ఞప్తులు వచ్చినప్పుడు వేగంగా స్పందించాలని మెటాకు స్పష్టం చేసినట్లు సమాచారం. హానికరమైన కంటెంట్‌ను గుర్తించడం, దాని వ్యాప్తిని అడ్డుకోవడంలో ప్రస్తుత వ్యవస్థల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచాలని సూచించినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. డేటా స్థానికీకరణపై స్పష్టత భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న సామాజిక మాధ్యమ సంస్థలు దేశీయ డేటా స్థానికీకరణ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కేంద్రం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. వినియోగదారుల భద్రత, సమాజంపై ప్రభావం చూపే కంటెంట్ నియంత్రణ విషయంలో సంస్థలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు పేర్కొన్నారు.

**లోపాలను అంగీకరించిన మెటా**

సమావేశంలో మెటా తన ప్రస్తుత వ్యవస్థలు ఆన్‌లైన్‌లోని హానికరమైన కంటెంట్‌ను ఎలా గుర్తిస్తున్నాయి, ఎలా నియంత్రిస్తున్నాయనే వివరాలను కేంద్ర అధికారులకు వివరించినట్లు సమాచారం. డీప్‌ఫేక్‌లు, ఇతర కృత్రిమంగా రూపొందించిన కంటెంట్‌ను ఎదుర్కొనేందుకు మరిన్ని సాంకేతిక చర్యలు తీసుకునే అవకాశాలను కూడా సంస్థ వెల్లడించినట్లు తెలుస్తోంది.

# మహిళా బిల్లుపై మాటల యుద్ధం

- **కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు రాహుల్ కౌంటర్**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 8 :**

మహిళా రిజర్వేషన్ అంశంపై అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు 'ఎక్స్' వేదికగా పరస్పరం స్పందించారు. మహిళా శక్తిపై రాహుల్ వ్యాఖ్యలను స్వాగతించిన రిజిజు మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా మద్దతివ్వాలని కోరారు. దీనికి ఘాటుగా బదులిచ్చిన రాహుల్ మహిళలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. వీడియోపై రిజిజు స్పందిస్తూ 'కాంగ్రెస్ పార్టీలో ఇది సానుకూల సందేశంగా కనిపిస్తోంది. రాహుల్ వైఖరిలో మహిళల విషయంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది' అని పోస్ట్ చేశారు. ఇదే





సమయంలో మహిళా రిజర్వేషన్ అంశాన్ని ప్రస్తావిస్తూ కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఎలాంటి షరతులు లేకుండా మద్దతివ్వాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిజు వ్యాఖ్యలకు రాహుల్ గాంధీ వెంటనే స్పందించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును 2023లోనే పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిందని గుర్తుచేశారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిగా కంటే ఈ విషయం ఎవరికి బాగా తెలుస్తుంది? మహిళా రిజర్వేషన్ చట్టం 2023 కాంగ్రెస్ పూర్తి మద్దతుతో ఏకగ్రీవంగా ఆమోదమైంది.. అయినా మూడేళ్లు గడిచినా ఎందుకు అమలు చేయలేదు? ఇప్పుడు దాన్ని డీలిమిటేషన్‌తో అనవసరంగా ఎందుకు ముడిపెడుతున్నారు అని ప్రశ్నించారు. మహిళలకు రిజర్వేషన్ కల్పించే 2023 చట్టాన్ని ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాహుల్ విడుదల చేసిన ఈ వీడియోలో మహిళల సామర్థ్యంపై విస్తృతంగా ప్రసంగించారు. దేశంలోని మహిళల శక్తి ఇంకా పూర్తిస్థాయిలో బయటకు రాలేదన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే మహిళలు తమ ఆలోచనలను స్వేచ్ఛగా వ్యక్తం చేయాలని, తమకు నచ్చిన రంగాల్లో ముందుకు సాగేందుకు అవకాశం ఉండాలని పేర్కొన్నారు. మహిళలు.. వ్యాపారం, రాజకీయాల్లో రాణించడమే కాక ఇళ్లలోనూ తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పగలగాలని, సమాజంలో ఎలాంటి భయం లేకుండా తిరగగలగాలని చెప్పారు. పితృస్వామ్య భావజాలం, మహిళలపై ఉండే కఠిన నియంత్రణ నుంచి కొంత విముక్తి అవసరమని రాహుల్ అభిప్రాయపడ్డారు. మహిళా శక్తి, మహిళా రిజర్వేషన్ అంశాలపై రాహుల్ వరుస వ్యాఖ్యల నేపథ్యంలో కేంద్రంకాంగ్రెస్ మధ్య రాజకీయ వాగ్వాదం మరోసారి తెరపైకి వచ్చింది.

# డిగ్రీతో కాదు.. దేశసేవ కలలతో బయటకు వెళ్లండి

- **ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ**
- **విద్యార్థులకు 'జీవిత పరీక్ష'పై కీలక సూచనలు**
- **ఏఐ ఆధారిత 'పరం ప్రజ్ఞ' సూపర్ కంప్యూటింగ్ కేంద్రం ప్రారంభం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 8**


ఐఐటీ ఢిల్లీలో చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు కేవలం డిగ్రీలు తీసుకుని బయటకు వెళ్లడం లేదని, దేశానికి గొప్ప సేవ చేయాలనే కలలతో కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. శనివారం ఐఐటీ ఢిల్లీలో జరిగిన 57వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన 3,000 మందికిపైగా పట్టభద్రులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు తమ భవిష్యత్తుకు విభిన్న మార్గాలను ఎంచుకున్నా, దేశాభివృద్ధికి తమ వంతు పాత్ర పోషించాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు.

**క్యాంపస్ పరీక్షకు.. జీవిత పరీక్షకు తేడా**

ఐఐటీ పరీక్షలకు నిర్దిష్టమైన సిలబస్, ప్రశ్నపత్రం ఉంటాయని, జీవితంలో ఎదురయ్యే పరీక్షలకు అలాంటి పరిమితులు ఉండవని మోదీ అన్నారు. జీవితంలో అసలు సమస్య ఏమిటో కూడా ఎవరూ ముందుగా చెప్పరని, దానిని గుర్తించి పరిష్కరించే సామర్థ్యాన్ని విద్యార్థులే పెంపొందించుకోవాలని సూచించారు. క్యాంపస్ జీవితానికి, బయట ఎదురయ్యే వాస్తవ జీవితానికి చాలా వ్యత్యాసం ఉంటుందని చెప్పారు.

**తొలి జీతం నుంచి స్టార్టప్ కలల వరకు**

స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రతి విద్యార్థి మనసులో భవిష్యత్తుపై ఎన్నో ఆలోచనలు ఉంటాయని ప్రధాని పేర్కొన్నారు. కొందరు తమ తొలి ఉద్యోగం, మొదటి జీతం కోసం ఎదురుచూస్తుంటే.. మరికొందరు కొత్త నగరంలో కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. ఇంకొందరు సొంతంగా స్టార్టప్ ప్రారంభించాలనే కలలు కంటున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరి ప్రయాణం, లక్ష్యం, కల భిన్నంగా ఉన్నప్పటికీ ఈ దశలో అందరిలోనూ ప్రత్యేకమైన అనుభూతి ఉంటుందని అన్నారు.



**ప్రయాణాన్ని గుర్తుచేసుకున్న మోదీ**

ఐఐటీ ఢిల్లీలో తొలిరోజు నుంచి స్నాతకోత్సవం వరకు విద్యార్థులు సాగించిన ప్రయాణాన్ని ప్రధాని గుర్తుచేశారు. ఓరియెంటేషన్ కార్యక్రమం నుంచి పట్టభద్రులయ్యే దశ వరకు ఎన్నో అనుభవాలు, సవాళ్లు ఎదుర్కొని ఈ స్థాయికి చేరుకున్నందుకు విద్యార్థులు గర్వపడాలని అన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను కూడా అదే పట్టుదలతో అధిగమించాలని ఆకాంక్షించారు.

**'పరం ప్రజ్ఞ' ప్రారంభం**

ఐఐటీ ఢిల్లీ సోనిపట్ క్యాంపస్‌లో ఏఐ ఆధారిత అత్యున్నత పనితీరు గల సూపర్ కంప్యూటింగ్ కేంద్రం 'పరం ప్రజ్ఞ'ను ప్రధాని ప్రారంభించారు. దేశంలో కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశోధనలు, సాంకేతిక ఆవిష్కరణలకు ఇటువంటి మౌలిక సదుపాయాలు కీలకమని పేర్కొన్నారు. ఏఐ రంగంలో కొత్త కార్యక్రమాలు ప్రారంభమైన సందర్భంగా విద్యార్థులకు మోదీ శుభాకాంక్షలు తెలిపారు.

**భవిష్యత్తును మీరే నిర్మించుకోవాలి**

తమ ముందున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని కొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని మోదీ పట్టభద్రులకు సూచించారు. ఉద్యోగం, పరిశోధన, వ్యాపారం.. ఏ రంగాన్ని ఎంచుకున్నా దేశ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని అన్నారు. ఐఐటీ విద్యతో పొందిన జ్ఞానాన్ని వ్యక్తిగత విజయానికే పరిమితం చేయకుండా సమాజానికి, దేశానికి ఉపయోగపడేలా మలచుకోవాలని పిలుపునిచ్చారు.

# ఎంతో కాలం యుద్ధంతో తీవ్ర నష్టం

- **ఇరాన్ యుద్ధం నుంచి బయటపడడమే మేలు**
- **ట్రంప్‌నకు జనరల్ డాన్ కేన్ సలహా !**

వాషింగ్టన్, ఆగస్ట్ 8 : ఐదు నెలలుగా ఇరాన్‌తో సాగిస్తోన్న యుద్ధం కారణంగా అమెరికా ఆయుధ నిల్వలు తరిగిపోతున్నాయని పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘర్షణలకు త్వరగా ముగింపు పలకాలని స్వదేశంలో డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే అగ్రరాజ్య జాయింట్ చీఫ్స్ ఛైర్మన్ జనరల్ డాన్ కేన్ ట్రంప్ కార్యవర్గానికి కీలక సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో యుద్ధం నుంచి ఇకనైనా బయటపడాలని.. లేదంటే ప్రతికూల ఫలితాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించినట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది. ఇరాన్‌తో యుద్ధం స్వల్పకాలికంగా ఉండాల్సింది. ఇప్పటికే అది ఆ దశను దాటేసింది. పశ్చిమాసియాలో ఘర్షణలు తీవ్రతరం చేయడానికి మనకు అందుబాటులో ఉన్న సైనిక చర్యలు ప్రతికూల ఫలితాలు ఇచ్చే ప్రమాదం ఉంది. కేవలం వైమానిక శక్తితోనే నిర్దేశిత లక్ష్యాలను మనం సాధించలేం. అందుకే ఇకనైనా ఈ యుద్ధం నుంచి బయటకు వచ్చే మార్గాలను అన్వేషించాలని ట్రంప్ సలహాదారులకు డాన్ కేన్ ప్రైవేటుగా చెప్పినట్లు తెలుస్తోంది. ఇదే విషయం గురించి ఆయన పలువురు కేబినెట్ అధికారులు, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తోనూ చర్చలు జరిపారట. ఇరాన్‌లో భూతల దాడులకు విముఖత చూపుతోన్న అధ్యక్షుడు ట్రంప్.. దానికి బదులుగా వైమానిక దాడులను మరింతగా పెంచుతామని ఇటీవల కాలంలో పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. ఈ హెచ్చరికలతో ఇరాన్‌ను ఒప్పందానికి తీసుకురావొచ్చని ఆయన విశ్వసిస్తున్నారు. అయితే సుదీర్ఘ కాలంగా వైమానిక దాడులు చేస్తుండటంతో అగ్రరాజ్య ఆయుధ నిల్వలు భారీగా తగ్గిపోతున్నాయి. ఇప్పటికే 80 శాతం మిసైల్ డిఫెన్స్ సిస్టమ్ ఇంటర్‌సెప్టర్లు, దాదాపు సగం పేట్రియాట్ క్షిపణులు కరిగిపోయినట్లు ఇటీవల కథనాలు వచ్చాయి. వీటిని ట్రంప్ కొట్టిపారేశారు. తమ వద్ద పెద్ద ఎత్తున ఆయుధ నిల్వలు ఉన్నట్లు పేర్కొన్నారు. అంతేగాక చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రక్షణ రంగ కంపెనీలు భారీ సంఖ్యలో ఫ్యాక్టరీలను నిర్మిస్తున్నాయని తన ట్రూత్ ఖాతాలో పోస్ట్ చేశారు. అయితే క్షిపణుల సంఖ్య గురించి మాత్రం కచ్చితమైన లెక్క చెప్పలేదు.




# డీలిమిటేషన్, మహిళా బిల్లుకు అకాలీదళ్ మద్దతు

- **మోదీతో సుఖ్‌బీర్ బాదల్ భేటీ.. బీజేపీతో మళ్లీ పొత్తుపై ఊహాగానాలు**

**చండీగఢ్, ఆగస్టు 8:**

పంజాబ్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. మహిళా రిజర్వేషన్ బిల్లు, ప్రతిపాదిత డీలిమిటేషన్ ప్రక్రియకు శిరోమణి అకాలీదళ్ మద్దతు ప్రకటించింది. ఆ పార్టీ అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయిన మరుసటి రోజే ఈ నిర్ణయం ప్రకటించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో బీజేపీ-అకాలీదళ్ మధ్య మళ్లీ రాజకీయ సమీకరణాలు మొదలయ్యాయన్న చర్చ ఊపందుకుంది.

**మహిళలకు త్వరగా ప్రాతినిధ్యం కల్పించాలి**

చండీగఢ్‌లో పార్టీ సీనియర్ నేతల సమావేశం అనంతరం సుఖ్‌బీర్ బాదల్ మాట్లాడుతూ మహిళలకు చట్టసభల్లో వారి హక్కైన ప్రాతినిధ్యాన్ని ఆలస్యం చేయకుండా కల్పించాలని కోరారు.



మహిళా గౌరవం, సమానత్వం, హక్కులకు సిక్కు గురువుల బోధనల్లో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని పేర్కొన్నారు. శిరోమణి గురుద్వారా పర్బంధక్ కమిటీ ఇప్పటికే సభలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు.

**లోక్‌సభ స్థానాల పెంపునకు అంగీకారం**

ప్రతిపాదిత డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను సమానంగా 50 శాతం పెంచాలన్న కేంద్ర ప్రతిపాదనకు అకాలీదళ్ మద్దతు తెలిపింది. 2011 జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ చేపట్టాలన్న ప్రతిపాదనను గతంలో వ్యతిరేకించినప్పటికీ.. చర్చల అనంతరం సమాన ప్రాతినిధ్యానికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు అకాలీ నేత దల్జీత్ సింగ్ చీమా తెలిపారు.

**మళ్లీ పొత్తుకు సంకేతాలా?**

రైతుల ఉద్యమం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను అకాలీదళ్ వ్యతిరేకించి బీజేపీతో సుమారు 25 ఏళ్ల రాజకీయ బంధాన్ని తెంచుకుంది. అప్పటివరకు రెండు పార్టీలు కలిసి పంజాబ్‌లో పలుమార్లు అధికారాన్ని చేపట్టాయి. పొత్తు ముగిసిన తర్వాత రెండు పార్టీల రాజకీయ ప్రభావం తగ్గింది. ముఖ్యంగా అకాలీదళ్ వరుస ఎన్నికల్లో ఇబ్బందులు ఎదుర్కొంటోంది.

ఈ నేపథ్యంలో పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సుఖ్‌బీర్ బాదల్ మోదీతో భేటీ కావడం, ఆ వెంటనే కీలక కేంద్ర ప్రతిపాదనలకు అకాలీదళ్ మద్దతు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. తాజా పరిణామాలు ఇరు పార్టీల మధ్య మళ్లీ రాజకీయ సాన్నిహిత్యానికి దారితీస్తాయా అన్న ఆసక్తి పంజాబ్ రాజకీయ వర్గాల్లో నెలకొంది.

# గ్రామపంచాయతీల విద్యుత్ బిల్లుల చెల్లింపులో ఆదర్శం

- **విద్యుత్ బిల్లుల చెల్లింపులో కరీంనగర్‌కు ఆరో స్థానం**
- **బకాయిలను పూర్తిగా చెల్లించి.. ఇకపై నెలవారీగా బిల్లులు కట్టాలి**
- **జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

**శెనార్తి మీడియా, కరీంనగర్:**



గ్రామపంచాయతీల విద్యుత్ బిల్లుల చెల్లింపులో కరీంనగర్ జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు. గ్రామపంచాయతీల సొంత నిధుల నుంచి విద్యుత్ బిల్లుల చెల్లింపునకు ప్రాధాన్యత ఇవ్వడంతో జనవరి నుంచి జూలై 2026 వరకు ఉన్న రూ.11.26 కోట్ల బకాయిల్లో రూ.5.71 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. దీంతో సుమారు 50 శాతం బకాయిలు క్లియర్ చేసినట్లు తెలిపారు. పంచాయతీ, విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో గ్రామపంచాయతీలు సొంత నిధుల నుంచి విద్యుత్ బిల్లులు చెల్లించాయని పేర్కొన్నారు. గ్రామపంచాయతీల సొంత నిధుల నుంచి ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్ బిల్లులు చెల్లించిన జిల్లాల్లో కరీంనగర్ రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచిందని తెలిపారు.

**పెండింగ్ బిల్లులపై రీకన్సిలియేషన్**

గ్రామపంచాయతీల విద్యుత్ బకాయిలను వాస్తవంగా నిర్ధారించేందుకు టీజీఎన్‌పీడీసీఎల్, జిల్లా పంచాయతీ అధికారి సమన్వయంతో గ్రామపంచాయతీల వారీగా ప్రత్యేక రీకన్సిలియేషన్ చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. మండల పంచాయతీ అధికారులు, విద్యుత్ శాఖ అసిస్టెంట్ అకౌంట్స్ అధికారులతో కలిసి పెండింగ్ బిల్లులను సమగ్రంగా పరిశీలించినట్లు చెప్పారు. ఈ ప్రక్రియ అనంతరం పంచాయతీలపై రూ.2.14 కోట్ల మేర బిల్లుల భారం తగ్గినట్లు వెల్లడించారు. వాస్తవ విద్యుత్ బకాయిలను ఖచ్చితంగా నిర్ధారించి, మిగిలిన బిల్లుల క్లియరెన్స్ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.

**నెలవారీగా బిల్లుల చెల్లింపు**

గ్రామపంచాయతీల విద్యుత్ బకాయిలను పూర్తి స్థాయిలో క్లియర్ చేయడంతో పాటు ఇకపై ప్రతి నెల విద్యుత్ వినియోగ ఛార్జీలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. సర్పంచుల సహకారంతో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పన్నుల బకాయిలను వసూలు చేయాలని సూచించారు. పన్నుల వసూళ్లతో పాటు గ్రామపంచాయతీలకు వచ్చే అద్దెలు, వేలం తదితర ఆదాయ మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. స్థానికంగా పంచాయతీల ఆదాయాన్ని పెంచుకోవడం ద్వారా అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని గ్రామాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులకు ఆటంకాలు లేకుండా చూడాలి

- **భూసేకరణ, అటవీ భూముల సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలి..**
- **మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు**
- **అభివృద్ధి పనులపై సమీక్ష**

**శెనార్తి మీడియా, హైదరాబాద్:**



నీటిపారుదల ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణానికి భూసేకరణ అడ్డంకిగా మారకుండా చర్యలు చేపట్టాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులను ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. శనివారం సచివాలయంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని నాలుగు జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని సూచించారు. భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలు, అటవీ భూముల బదలాయింపు అంశాలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. నూతన రోడ్ల నిర్మాణంతో పాటు దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు జిల్లాల్లోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఇంజనీర్ల కొరత ఉందన్న ఫిర్యాదులు వస్తున్నాయని, డిప్యుటేషన్‌పై ఇంజనీర్లను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేయాలని ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో నీటమునిగిన నివాస ప్రాంతాల ప్రజలకు ప్రత్యామ్నాయంగా మరోచోట ఇళ్ల స్థలాలు కేటాయించాలని కలెక్టర్లను సూచించారు. వర్షాకాలంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్లక్ష్యం చేస్తే అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని హెచ్చరించారు. మున్సిపాలిటీలు, ఎన్టీపీసీ, జెన్‌కో, సింగరేణి సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ పారిశుధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

## వృద్ధ దంపతుల ఆవేదన

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



వృద్ధాప్యంలో తమను మానసికంగా వేధించడం సరికాదని శంకరపట్నం మండలం చింతలపల్లికి చెందిన నిమ్మశెట్టి వసంత, బాబురావు దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం వారు పాత్రికేయులతో మాట్లాడుతూ తమ కష్టార్జితంతో సంపాదించిన వ్యవసాయ భూమిని 2021లో ఇద్దరు కుమారులకు తలా 2 ఎకరాల 20 గుంటల చొప్పున పంపిణీ చేశామని తెలిపారు. తమ జీవనాధారం కోసం ఇంటి స్థలంతో కలిపి 38 గుంటల భూమిని ఉంచుకున్నామని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న ఇంటి పునర్నిర్మాణానికి ఇద్దరు కుమారులు చెరో రూ.లక్ష చొప్పున ఇస్తామని పెద్దమనుషుల సమక్షంలో అంగీకరించినప్పటికీ, చిన్న కుమారుడు తర్వాత పట్టించుకోలేదని ఆరోపించారు. ఇల్లు పూర్తిగా శిథిలం కావడంతో అప్పులు చేసి తామే నిర్మించుకున్నామని, ఆ అప్పులు తీర్చేందుకు తమ భూమిలో కొంత భాగాన్ని విక్రయించేందుకు ప్రయత్నించామని తెలిపారు. ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న చిన్న కుమారుడు తన పలుకుబడితో భూమి కొనుగోలుకు ఇతరులు ముందుకు రాకుండా అడ్డుకున్నాడని ఆరోపించారు. దీంతో పెద్ద కుమారుడిని ఒప్పించి గత నెలలో పెద్దమనుషుల సమక్షంలో బయానా తీసుకుని రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసినట్లు వివరించారు. రిజిస్ట్రేషన్ సమయంలో నాయబ్ తహసీల్దార్ ఇన్‌చార్జిగా ఉండటంతో విచారణ అనంతరం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు. తాము చిన్న కుమారుడిని మోసం చేస్తున్నామంటూ వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు ప్రచారం చేస్తూ మానసికంగా వేధిస్తున్నారని దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది వారసత్వంగా వచ్చిన భూమి కాదని, తమ కష్టార్జితంతో సంపాదించుకున్నదేనని స్పష్టం చేశారు. చిన్న కుమారుడు ప్రభుత్వ ఉద్యోగంలో ఉండటంతో తమకు ప్రభుత్వ పెన్షన్ కూడా రావడం లేదన్నారు. తమ వివరణ తీసుకోకుండా ప్రతిష్ఠకు భంగం కలిగించేలా తప్పుడు ప్రచారం చేయవద్దని, ప్రచారం కొనసాగితే చట్టపరంగా పోరాడతామని వృద్ధ దంపతులు హెచ్చరించారు.

## కోతుల దాడిలో వృద్ధుడికి గాయాలు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



శంకరపట్నం మండలంలో కోతుల గుంపుల బెడదతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గత ఆరు నెలలుగా పిల్లలు, వృద్ధులు, ఉపాధ్యాయులు, మహిళలు, బాటసారులు, రైతులపై కోతులు దాడి చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. తాజాగా శనివారం రాజాపూర్‌లో వ్యక్తిగత అవసరాల కోసం వెళ్తున్న రెడ్డి నర్సయ్య (75)పై కోతుల గుంపు దాడి చేసింది. ఈ ఘటనలో నర్సయ్య ఎడమ కాలుకు తీవ్ర గాయమై రక్తస్రావంతో రోడ్డుపై పడిపోయాడు. కుటుంబ సభ్యులు ఆయనను స్థానిక పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు



## ప్రచార జాతాను విజయవంతం చేయాలి

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు చేపట్టిన ప్రచార జాతా ఈనెల 10న గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్‌కు చేరుకోనుందని సీపీఐ నాయకులు తెలిపారు. ప్రచార జాతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం గన్నేరువరం మండల కేంద్రంలో సీపీఐ నాయకులు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 10న గన్నేరువరం మండలానికి రానున్న సీపీఐ ప్రచార జాతాలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాంతాల అంజిరెడ్డి, మండల సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, సహాయ కార్యదర్శులు కూన మల్లయ్య, పిప్పల కనుకయ్య, గుండ్లపల్లి గ్రామ కార్యదర్శి బోయిని తిరుపతి, గన్నేరువరం కార్యదర్శి బోయిని మల్లయ్య, కళ్లే రవి తదితరులు పాల్గొన్నారు.



## మోడల్ స్కూల్‌లో ఘనంగా మా బడి బోనాలు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:**



శంకరపట్నం మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 'మా బడి బోనాలు' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపల్ కె. ప్రభాకర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. పోతురాజు వేషధారణలో విద్యార్థుల నృత్యాలు, సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థినులు బోనాలు ఎత్తుకొని నిర్వహించిన ఊరేగింపు ఆకట్టుకుంది. ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలుగు, ఇంగ్లీష్ విభాగాల ఉపాధ్యాయులు డా. మహేందర్, రాధ, సంధ్య, అనిత, శంకర్, రమణారెడ్డి సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## రేకుర్తిలోని విజన్ హైస్కూల్ లో బోనాల సంబరాలు

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

రేకుర్తి విజన్ హైస్కూల్ లో బోనాల సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ మాట్లాడుతూ ఆషాఢ మాసంలో ప్రత్యేకంగా తెలంగాణలో బోనాల పండుగ జరుపుకుంటారు. అందులో భాగంగా ఈరోజు మన స్కూల్ తరపున పోచమ్మ తల్లికి బోనం సమర్పించుకుని తల్లి కృప వల్ల అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు పోతు రాజుల మరియు అమ్మవారి వేషధారణతో అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నారు. అదేవిధంగా విద్యార్థుల యొక్క సాంస్కృతిక కార్యక్రమాలను చూసి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేసినారు. ఈ విధంగా వేడుకలు ఏర్పాటు చేయడం పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ సందవేణి వెంకట్ ఇంచార్జ్ ప్రతిభ భారతి, ఉపాధ్యాయులు , విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి



**శెనార్తి మీడియా, శంకరపట్నం:**

పంద్రాగస్టున ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ అధిష్ఠానం పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా విజయవంతానికి కేశవపట్నంలోని ఓ గార్డెన్లో శనివారం బీజేపీ శంకరపట్నం మండల సన్నాహక సమావేశం మండల అధ్యక్షుడు ఎనుగుల అనిల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాడ వెంకటరెడ్డి మాట్లాడారు. జాతీయ జెండా దేశ గౌరవానికి ప్రతీక అని, అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి కుటుంబం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగస్వాములు కావాలని మాడ వెంకటరెడ్డి అన్నారు. కార్యక్రమాన్ని గ్రామగ్రామాన, ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. ఆగస్టు 12న కేశవపట్నంలో 'హర్ ఘర్ తిరంగా' బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 13న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని, ఆగస్టు 15న ప్రతి బూత్ పరిధిలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో జరిగే ప్రధాన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, దండు కొమురయ్య, జంగ జైపాల్, కొయ్యడ అశోక్, రసమల శ్రీనివాస్, నిమ్మచెట్టి సంపత్, చర్ల శ్రీనివాస్, కనకం సాగర్, దాసరపు నరేందర్, పడాల వెంకటలక్ష్మి, గుండ్ల లక్ష్మి, బోడ తిరపతి రెడ్డి, శ్రీనాథ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.




## ప్రతి ఇంటిపై జాతీయ జెండా



**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గన్నేరువరం మండలంలో ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సంగ నరేష్ పిలుపునిచ్చారు. శనివారం గన్నేరువరం మండల బీజేపీ అధ్యక్షుడు తిప్పర్తి నిఖేష్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహణపై మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సంగ నరేష్ మాట్లాడుతూ ఆగస్టు 10 నుంచి 15 వరకు నిర్వహించనున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ప్రతి ఇంటిపై జాతీయ మువ్వన్నెల జెండా ఎగురవేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, తిరంగా యాత్రలో కార్యకర్తలు చురుకుగా పాల్గొని యువత, మహిళలు, రైతులు సహా అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలని కోరారు. గన్నేరువరం మండలంలో జాతీయ జెండా లేని ఇల్లు లేకుండా కార్యక్రమాన్ని నిర్వహించాలని, చిన్నారులను సైతం భాగస్వాములను చేసి దేశభక్తి భావాన్ని భవిష్యత్ తరాలకు చాటాలని చెప్పారు. మండల అధ్యక్షుడు తిప్పర్తి నిఖేష్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని మండలంలో ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి బూత్, ప్రతి వార్డు, ప్రతి ఇంటికి జాతీయ పతాకం చేరేలా పార్టీ కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు సొల్లు అజయ్ వర్మ, సీనియర్ నాయకులు ఎలేటి చంద్రారెడ్డి, అనిల్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు బొమ్మాడి సురేందర్ రెడ్డి, పుల్లెల రాము, మండల కార్యదర్శులు సిహెచ్ చంద్రయ్య, బూట్ల సంపత్, నాయకులు బండి తిరుపతి, మునిగంటి సత్తయ్య, పుల్లెల జగన్, మోహన్ రామకృష్ణారెడ్డి, వార్డు సభ్యుడు మచ్చ సాయి కృష్ణ, కార్యవర్గ సభ్యులు మునిగంటి లింగయ్య, జీల ఎల్లయ్య, బూత్ అధ్యక్షులు కొంకటి రవీందర్, విలాసారం రాయమల్లు, దానవేణి ప్రశాంత్, కర్ర శ్రీకాంత్, కూన ప్రశాంత్, జైపాల్ రెడ్డి, రాకేష్, ముఖేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# నవ్వుల పూలంగి హాస్య చక్రవర్తి రేలంగి

## నేడు హాస్య చక్రవర్తి రేలంగి జయంతి

కమెడియన్‌గా, విలన్‌గా, క్యారెక్టర్ నటుడిగా, తన ప్రతిభను అన్ని కోణాల్లో ఆవిష్కరించిన హాస్య చక్రవర్తి రేలంగి. తెలుగు సినీ హాస్యనటుల్లో తొలి పద్మశ్రీ పురస్కారం అందుకున్న కామెడీ కింగ్. తెలుగు సినీ హాస్య సామ్రాజ్యాన్ని దాదాపు రెండు దశాబ్దాలు ఏకఛత్రాధిపత్యంగా ఏలిన హాస్యపు రారాజు రేలంగి. తెలుగు ప్రజల ఆదరాన్ని చూరగొన్నారు. 'మా రేలంగోడు' అని అభిమానంగా పిలిపించు కున్నారు. చెప్పులు లేకుండా నడచిన పాండీ బజారులో ఏనుగు అంబారీమీద ఊరేగాడు. పుట్టి పెరిగిన నేలమీద ఆయన గజారోహణం చేయించు కున్నారు. అసాధ్యాలను సాధ్యాలుగా మలుచు కున్నారు. అగ్రశ్రేణి హీరో రామారావు చేత బావా' ' అని ప్రేమతో, ఆదరంగా పిలిపించు కున్నారు. నటీనటుల చేత, జర్నలిస్టుల చేత సత్కారాలు పొందారు. దేశాధ్యక్షుని చేతిమీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకొని తొలి హాస్య నటుడిగా చరిత్ర పుటల కెక్కారు... పుట్టిన నేల తల్లిని మరవకుండా చివరి దశలో అక్కడే తనువు చాలించారు. అంతటి గొప్ప పాత తరం నటుడైన రేలంగి వెంకట రామయ్య (9 ఆగస్టు 1910 - 26 నవంబర్ 1975) జయంతి సందర్భంగా ఆయన జీవన ప్రస్థానంలో ప్రత్యేకతల గురించి తెలిపే చిరు ప్రయత్నం ఇది. రేలంగి వెంకట్రామయ్య తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ సమీపంలోని రావులపాడులో 1910, ఆగష్టు 9వ తేదీన జన్మించారు. తొలి రోజుల్లో తనపాటలు తనే పాడుకునేవారు. 'పాతాళభైరవి'లో 'వినవే బాలా నా ప్రేమ గోలా', 'తాళలేనే నే తాళలేనే అమ్మలారా ఓయమ్మలారా', పాటలు; విప్రనారాయణ సినిమాలో 'ఆడది అంటే లయం లయం ఆ నీడంటేనే భయం భయం' పాట; మిస్సమ్మ సినిమాలో 'ధర్మం చెయ్ బాబూ కాణీ ధర్మం చెయ్ బాబూ', ' సీతారాం సీతారాం, సీతారాం జై సీతారాం'; ఎత్తుకు పైఎత్తు చిత్రంలో 'ఎవడను కున్నావు' పాటలు వాటిలో కొన్ని మాత్రమే. సినిమాలన్నిటిలోనూ వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ, పాత్రోచితంగా సంభాషణలు నొక్కి వక్కాణించడం హాస్యనటుడిగా ఒక్క రేలంగికే సాధ్యమైంది. అందుకే హీరోతో సమాన ప్రాధాన్యంగా ఉండేలా రచయితలు రేలంగి పాత్రలను తీర్చిదిద్దారు. ఒక హీరో మరియు హీరోయిన్‌కు లభించే జీతం వలె రేలంగి వెంకట రామయ్యకు భారీ మొత్తాన్ని అందించారు. జెమినీ వారు నిర్మించిన 'బాలనాగమ్మ' (1942) చిత్రంలో తలారి రాముడు పాత్ర పోషించిన రేలంగి మళ్ళీ పదిహేడు సంవత్సరాల తరువాత శ్రీవేంకటరామణా వారు నిర్మించిన 'బాలనాగమ్మ' (1959) చిత్రంలో అదే పాత్రను పోషించడం విశేషం. అలాగే 'గొల్లభామ' (1947) చిత్రంలో ధరించిన విదూషకుడి పాత్రనే ఇరవై ఏళ్ల తరవాత 'భామా విజయం' (1967) చిత్రంలో తిరిగి పోషించారు.

రేలంగి పోషించిన ఏ పాత్రైనా కథలో ప్రధాన భాగంగా ఉండేదే కానీ, అతికించినట్లు వుండేది కాదు. 'చెంచులక్ష్మి' చిత్రంలో నారదునిగా 'నీలగగన ఘన శ్యామా దేవా' అనే హరినామ కీర్తన చేస్తూ నటిస్తుంటే ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. రేలంగి కోసం 'సరదా సరదా సిగిరెట్టు ఇది దొరల్ తాగు బల్ సిగిరెట్టు' (సిరి సంపదలు), 'అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే' (కులగోత్రాలు), 'హరి గోవింద గోవింద' (వెలుగు నీడలు), 'ఇంగ్లీషులోన మ్యారేజి' (ఆరాధన), 'గనగజా తనయం సహృదయం' (వాగ్దానం), 'చెక్కిలి మీద చెయ్యి జేర్చి చిన్నదానా' (మాంగల్య బలం), 'ఆ దేవుడు మనిషిగ పుట్టాలిరా' (అంతస్తులు), 'నీసోకు చూడకుండ నవనీతమ్మో' (తోడి కోడళ్ళు), 'భలేచాన్సులే బలే చాన్సులే' (ఇల్లరికం) వంటి ఎన్నో సరదా పాటలు ఆరోజుల్లో సినిమాల్లో పెడితే ప్రేక్షకులు ఎంతబాగా ఆదరించారో చెప్పాల్సిన పనే లేదు. రేలంగి నటించిన చివరి సినిమా ఎన్టీఆర్ నటించిన 'నిప్పులాంటి మనిషి. 1970లో భారత ప్రభుత్వం రేలంగికి 'పద్మశ్రీ' అవార్డు ఇచ్చి సత్కరించింది. పద్మ పురస్కారం అందుకున్న తొలి హాస్య నటుడు రేలంగి కావడం విశేషం. శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయానికి రేలంగి సెనేట్ సభ్యుడుగా వ్యవహరించారు. ఆంధ్రనాటక కళాపరిషత్తు, హైదరాబాదు వారు 1955లో రేలంగికి ఘనసత్కారం చేశారు. తనవద్ద పనిచేసిన డ్రైవరుకు వృద్ధాప్యం వలన కళ్లు కనుపించక పోతే, అతనికి ఒక ఇల్లు కట్టించి నెలనెలా పించను వచ్చేలా కొంత పెద్ద మొత్తాన్ని బ్యాంకులో వేసి ఆదుకున్న మానవతా మూర్తి ఆయన. రేలంగి వృద్ధిలోకి వచ్చాక కష్టాలను, కష్టాలలో ఆదుకున్న మిత్రులను మరచిపోలేదు. తను తిండితిప్పలు లేకుండా అవస్థపడిన వాడు కనుక, తను భోజనం చేసేటప్పుడు కనీసం పాతిక మందికి భోజనం పెట్టే సదాచారాన్ని పాటించారు. నాటి అగ్ర కథా నాయకులు రామారావు, నాగేశ్వరరావు కన్నా ముందే చిత్రసీమలో అడుగు పెట్టినవాడు కావడంతో ఇద్దరూ రేలంగిని ఎంతగానో గౌరవించేవారు. వరవిక్రయం' సినిమాలో భానుమతి నటించడానికి కారకులు రేలంగి. అలాగే అంజలీదేవి 'గొల్లభామ'లో నటించడానికి ఆమెను పుల్లయ్యకు పరిచయం చేసిన వ్యక్తి రేలంగి. రేలంగి కాస్టింగ్ ఏజంటుగా పనిచేస్తుండడంతో కృష్ణవేణి, పుష్పవల్లి, హైమవతి, భానుమతి, అంజలీదేవి వంటి నటీమణుల్ని సినిమాల్లో పరిచయం చేసే గొప్ప అవకాశం రేలంగికి దక్కింది. 1910లో జన్మించి, 65 వ ఏట 1975 సంవత్సరంలో మరణించిన రేలంగి తెలుగు సినిమా మనగలిగినంత కాలం హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోతారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# వరుణ యాగం... వర్షాభిలాషకు వైదిక సంకల్పం

### ఆధ్యాత్మిక సంకల్పం... ఆయకట్టు సుభిక్షం

### జల సిరుల కోసం వరుణ యాగం



వాన చినుకు కోసం నేల ఆత్రుతగా ఎదురు చూస్తోంది. ఆశల పల్లకి మోసుకొచ్చే నల్లని మబ్బుల కోసం రైతు కళ్లు ఆకాశాన్ని తిలకిస్తున్నాయి. పల్లెల్లో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు జలకళ కోసం నిరీక్షిస్తున్నాయి. విత్తిన విత్తనం మొలకెత్తి పంట పొలాలు పచ్చదనం పరుచుకోవాలని, బావుల్లో జలమట్టాలు పెరగాలని, జలాశయాలు నిండుకుండల్లా తొణికిసలాడాలని తెలంగాణ గ్రామీణ సీమ కోరుకుంటోంది. వాతావరణంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, రుతుపవనాల గమనంలో మార్పులతో కొన్ని ప్రాంతాల్లో వర్షాల కోసం ఎదురుచూపులు కొనసాగుతున్న వేళ.. రాష్ట్రంలో సమృద్ధిగా వానలు కురిసి, నదులు పరవళ్లు తొక్కి, జలాశయాలు నిండి, రైతాంగం సుభిక్షంగా ఉండాలన్న ఆకాంక్షతో తెలంగాణ ప్రభుత్వం 'మహా వరుణ యాగం' నిర్వహించేందుకు సిద్ధమైంది. ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ వైదిక క్రతువు జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనల మేరకు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులు, రుత్వికులు శాస్త్రోక్తంగా యాగాన్ని నిర్వహించనున్నారు.

### సాగర్ తీరమే యాగ వేదిక

మహా వరుణ యాగానికి నాగార్జునసాగర్‌ను వేదికగా ఎంచుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. కృష్ణానదిపై నిర్మించిన నాగార్జునసాగర్ ప్రాజెక్టు తెలుగు రాష్ట్రాల్లోని విస్తారమైన ఆయకట్టుకు దశాబ్దాలుగా జీవనాడిగా నిలుస్తోంది. వ్యవసాయం, తాగునీరు, విద్యుదుత్పత్తి అవసరాల్లో ఈ ప్రాజెక్టుకు అత్యంత కీలక స్థానం ఉంది. సాగర్ జలాలతో ఆయకట్టు కళకళలాడితే రైతుల్లో ధైర్యం పెరుగుతుంది. పంట పొలాలకు జీవం వస్తుంది. వ్యవసాయాధారిత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో చైతన్యం నెలకొంటుంది. అందుకే మహా జలాశయం తీరాన వరుణ యాగం నిర్వహించడాన్ని కేవలం ఆధ్యాత్మిక ప్రార్థనగానే కాకుండా.. నీటి ప్రాధాన్యాన్ని, రైతు ఆకాంక్షలను ప్రతిబింబించే సందర్భంగానూ చూడవచ్చు. యాగం కోసం విజయ విహార్ ప్రాంగణంలో వైదిక నియమాలకు అనుగుణంగా 11 హోమకుండాలను ఏర్పాటు చేస్తున్నారు. 108 మంది వేద పండితులు, అర్చకులు, రుత్వికులు మంత్రోచ్చారణల మధ్య క్రతువును నిర్వహించనున్నారు. సప్తశతి, రుద్ర, పవమాన, వరుణ సూక్తాలతో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. యాదాద్రి దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి నిర్ణయించిన ముహూర్తం మేరకు ఆగస్టు 10న మధ్యాహ్నం 3.20 గంటల నుంచి 3.24 గంటల మధ్య మహా పూర్ణాహుతి నిర్వహించనున్నట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. కృష్ణా, గోదావరి నదులు జలకళ సంతరించుకోవాలని, చెరువులు, ప్రాజెక్టులు నిండాలని, రైతాంగం సుభిక్షంగా ఉండాలని సంకల్పం చేయనున్నారు.

### యాగంతోనే కాదు.. జల సంరక్షణతోనూ

తెలంగాణలోని వేలాది చిన్న, మధ్యతరహా చెరువులను సంరక్షించడం, కాలువలను ఆధునికీకరించడం, వర్షపు నీటిని భూమిలోకి ఇంకించే నిర్మాణాలను పెంచడం, నీటిని పొదుపుగా వినియోగించే సూక్ష్మ సేద్య పద్ధతులను ప్రోత్సహించడం దీర్ఘకాలిక నీటి భద్రతకు అత్యవసరం. వర్షపాతం అనేది రుతుపవనాల కదలికలు, అల్పపీడనాలు, ఉపరితల ఆవర్తనాలు, సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, ఎల్‌నినో-లానినా వంటి అనేక వాతావరణ అంశాలపై ఆధారపడే సంక్లిష్టమైన ప్రకృతి ప్రక్రియ. అందువల్ల వరుణ యాగాన్ని వాతావరణ శాస్త్రానికి ప్రత్యామ్నాయంగా కాకుండా.. ప్రకృతి పట్ల మానవ సమాజం వ్యక్తం చేసే సామూహిక ఆకాంక్ష, ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా చూడాలి. ఆధ్యాత్మిక విశ్వాసంతో పాటు శాస్త్రీయ జల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, అడవుల పెంపకం, వర్షపు నీటి సంరక్షణను సమన్వయం చేసుకున్నప్పుడే నీటి సమస్యలకు దీర్ఘకాలిక పరిష్కారం సాధ్యమవుతుంది.

### మంత్రఘోష.. రైతు గుండెల్లో వాన ఆశ

ఒకవైపు సాగర్ తీరాన వేద పండితుల మంత్రఘోషలు మార్మోగుతుంటే.. మరోవైపు పొలంలో వేసిన విత్తనం కోసం రైతు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నాడు. రెండింటి ఆకాంక్ష ఒక్కటే. మబ్బులు కమ్మాలి.. వాన కురవాలి.. ఎండిన నేల తడవాలి.. పంటలు పండాలి.. రైతు ఇంట సంతోషం వెల్లివిరియాలి. సాగర్ తీరాన నిర్వహించే మహా వరుణ యాగం ఒక వైదిక క్రతువుగానే మిగిలిపోకుండా.. వర్షం, నేల, నీరు, రైతు జీవితం పరస్పరం ఎంత బలంగా ముడిపడి ఉన్నాయో గుర్తుచేసే సందర్భంగా మారాలి. యాగంలో వ్యక్తమయ్యే జలసంకల్పం.. ప్రతి వాన చినుకునూ ఒడిసిపట్టే ప్రజా కార్యాచరణగా రూపాంతరం చెందినప్పుడే ఆ ప్రార్థన మరింత సార్థకమవుతుంది. అదే పచ్చని తెలంగాణకు నిజమైన సువర్ణ బాట.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# సకల పాప హారిణి.. కామిక ఏకాదశి

### శ్రీహరి ఆరాధనకు పరమ పవిత్రమైన పర్వదినం

### తులసీ దళ పూజతో అనంత పుణ్యఫలమని పురాణోక్తి

### ఉపవాసం.. జాగరణతో మోక్షప్రాప్తి కలుగుతుందని విశ్వాసం

### కోరికలు సిద్ధింపజేసే ఏకాదశిగా ప్రత్యేక ప్రాశస్త్యం



ఆషాఢ మాసంలో కృష్ణపక్ష ఏకాదశిని 'కామిక ఏకాదశి'గా జరుపుకుంటారు. అత్యంత పవిత్రమైన, పుణ్యప్రదమైన ఏకాదశుల్లో దీనికి విశిష్ట స్థానం ఉంది. పేరుకు తగినట్లుగానే మనసులోని ధర్మబద్ధమైన కోరికలను నెరవేర్చే శక్తి ఈ ఏకాదశికి ఉందని భక్తుల విశ్వాసం. శ్రీమహావిష్ణువును భక్తిశ్రద్ధలతో ఆరాధించడం, ఉపవాసం పాటించడం, తులసీ దళాలతో పూజించడం ఈ పర్వదినంలో ప్రధానమైన ఆచారాలుగా పురాణాలు పేర్కొంటున్నాయి. శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉండే చాతుర్మాస కాలంలో వచ్చే తొలి కృష్ణపక్ష ఏకాదశి కావడంతో కామిక ఏకాదశికి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ఈ రోజున శ్రీహరిని ఆరాధించడం, తులసీ దళాలతో అర్చించడం, దీపారాధన చేయడం, దానధర్మాలు ఆచరించడం విశేష ఫలితాలను ఇస్తాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి.

### కాశీ స్నానాన్ని మించిన పుణ్యమని విశ్వాసం

కామిక ఏకాదశి రోజున శ్రీహరిని భక్తితో ఆరాధించడం ద్వారా అపారమైన పుణ్యఫలం లభిస్తుందని పురాణ కథనాలు పేర్కొంటున్నాయి. కాశీలో గంగాస్నానం, కేదారనాథుని దర్శనం, సూర్యగ్రహణ సమయంలో కురుక్షేత్రంలో పుణ్యస్నానం, భూదానం వంటి మహా పుణ్యకార్యాలతో సమానమైన లేదా అంతకంటే విశేషమైన ఫలం కామిక ఏకాదశి వ్రతంతో లభిస్తుందని విశ్వసిస్తారు.

### శ్రీకృష్ణుడు చెప్పిన ఏకాదశి మహిమ

పురాణ కథనం ప్రకారం ధర్మరాజు యుధిష్ఠిరుడు ఆషాఢ కృష్ణపక్షంలో వచ్చే ఏకాదశి మహిమను వివరించాలని శ్రీకృష్ణుడిని కోరాడు. అప్పుడు శ్రీకృష్ణుడు కామిక ఏకాదశి విశిష్టతను వివరిస్తూ బ్రహ్మదేవుడు నారద మహర్షికి తెలిపిన విషయాలను ధర్మరాజుకు వివరించినట్లు చెబుతారు. నారదుడు తన తండ్రి బ్రహ్మదేవుడిని ఆషాఢ కృష్ణపక్ష ఏకాదశి విశిష్టత గురించి అడగగా.. దీనినే కామిక ఏకాదశి అంటారని, దీని మహిమను విన్నంత మాత్రాన కూడా పుణ్యం లభిస్తుందని బ్రహ్మ వివరించినట్లు పురాణ కథనం. శంఖచక్రగదాధరుడైన శ్రీమహావిష్ణువును శ్రీధరుడు, హరి, విష్ణువు, మాధవుడు, మధుసూదనుడు తదితర నామాలతో ఈ రోజున భక్తిశ్రద్ధలతో ఆరాధించాలని పేర్కొంటారు.

### తులసీ దళానికి అపారమైన ప్రాధాన్యం

కామిక ఏకాదశి ఆరాధనలో తులసికి అత్యంత ప్రాధాన్యం ఉంది. ఒక్క తులసీ దళంతో శ్రీమహావిష్ణువును భక్తితో పూజించినా విశేషమైన పుణ్యం లభిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి. బంగారం, వెండి, రత్నాలను సమర్పించి చేసే పూజకంటే తులసీ దళంతో చేసే అర్చన శ్రీహరికి అత్యంత ప్రీతికరమని విశ్వాసం. తామరాకుపై నీటిబొట్టు అంటనట్లే కామిక ఏకాదశి రోజున తులసీ దళాలతో విష్ణువును ఆరాధించిన వారికి పాపాలు అంటవని పురాణోక్తి. తులసి మొక్కను పూజించి, నెయ్యి దీపం వెలిగించడం కూడా అత్యంత పుణ్యప్రదమని చెబుతారు. లేత తులసీ దళాలతో శ్రీహరిని అర్చించడం గత జన్మల పాపాలను సైతం హరిస్తుందని భక్తుల విశ్వాసం.


### ఉపవాసం.. జాగరణకు విశిష్ట ఫలం

కామిక ఏకాదశి రోజున ఉపవాసం పాటిస్తూ శ్రీహరి నామస్మరణ చేయడం అత్యంత పుణ్యప్రదమని చెబుతారు. రాత్రివేళ భగవన్నామ స్మరణతో జాగరణ చేయడం ద్వారా ఆధ్యాత్మిక ఫలం సిద్ధిస్తుందని పురాణాలు పేర్కొంటున్నాయి. ఏకాదశి వ్రతాన్ని సంపూర్ణ భక్తితో ఆచరించిన వారికి మోక్షమార్గం సుగమమవుతుందని విశ్వాసం. ఈ రోజున గోదానం చేయడం, అన్నదానం, వస్త్రదానం వంటి దానధర్మాలు చేయడం కూడా విశేష ఫలితాలను ఇస్తాయని చెబుతారు. పాప పరిహారం కోరుకునేవారు భక్తిశ్రద్ధలతో ఏకాదశి వ్రతాన్ని ఆచరించాలని పురాణ కథనాలు వివరిస్తున్నాయి.

### దీపారాధనతో శ్రీహరి అనుగ్రహం

కామిక ఏకాదశి రోజున శ్రీకృష్ణుడిని లేదా శ్రీమహావిష్ణువును నిష్ఠగా పూజించి నువ్వుల నూనె లేదా నెయ్యితో దీపం వెలిగించడం శుభప్రదమని పండితులు చెబుతున్నారు. సూర్యోదయానికి ముందే నిద్రలేచి శుచిగా స్నానమాచరించి, శ్రీహరి పూజ, తులసీ పూజ, నామస్మరణ చేయడం సంప్రదాయంగా వస్తోంది. కామిక ఏకాదశి వ్రతం పాప విమోచనానికి అత్యంత శక్తిమంతమైనదని పురాణాలు వర్ణిస్తున్నాయి. బ్రహ్మహత్య వంటి మహాపాతకాల నుంచి కూడా విముక్తిని ప్రసాదించే శక్తి ఈ ఏకాదశికి ఉందని పౌరాణిక కథనాల్లో ప్రస్తావన ఉంది. భక్తి, నియమం, ఉపవాసం, తులసీ పూజ, దీపారాధన, దానధర్మాలతో కామిక ఏకాదశిని ఆచరించడం ద్వారా శ్రీహరి అనుగ్రహం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఆషాఢ కృష్ణపక్షంలో వచ్చే ఈ పవిత్ర తిథిని లిలి'సకల పాప హారిణి.. కామిక ఏకాదశి'లిలిగా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494




## యశస్వితో రిలేషన్‌షిప్..

- మృణాల్ ఠాకూర్ కామెంట్స్ వైరల్.. నిజమెంత?

బాలీవుడ్ నటి మృణాల్ ఠాకూర్, భారత యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్ మధ్య డేటింగ్ జరుగుతోందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ రూమర్స్‌కు మరింత ఆజ్యం పోసేలా మృణాల్ ఠాకూర్ పేరుతో ఓ కామెంట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే, ఈ వైరల్ కామెంట్ నిజంగా మృణాల్ చేసిందేనా? అనే సందేహాలు ఇప్పుడు వ్యక్తమవుతున్నాయి.


కొంతకాలం క్రితం మృణాల్ ఠాకూర్, యశస్వి జైస్వాల్ ముంబైలోని ఓ కేఫ్ నుంచి బయటకు వస్తున్నట్లు కనిపించారు. ఇద్దరూ ఒకేసారి బయటకు వచ్చినప్పటికీ, వేర్వేరుగా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే ఊహాగానాలు మొదలయ్యాయి.

ఈ నేపథ్యంలో యశస్వితో తన సంబంధంపై మృణాల్ స్పందించారంటూ ఓ కామెంట్ ఇప్పుడు వైరల్ అవుతోంది. అందులో పుకార్లను నమ్మవద్దని, ఇలాంటి విషయాలపై వీడియోలు చేయడం కంటే సరైన అంశాలపై దృష్టి పెట్టాలని మృణాల్ చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ కామెంట్ ప్రస్తుతం వైరల్ వీడియోలో కనిపించడం లేదు. దీంతో ఆ వ్యాఖ్య నిజంగా మృణాల్ చేసినదేనా లేదా అనేది స్పష్టంగా నిర్ధారించలేని పరిస్థితి నెలకొంది. మృణాల్ ఠాకూర్, యశస్వి జైస్వాల్ మధ్య వయసులో సుమారు 9 నుంచి 10 ఏళ్ల తేడా ఉంది. మృణాల్ వయసు 34 సంవత్సరాలు కాగా, యశస్వి వయసు 24 సంవత్సరాలు. ఇదిలా ఉంటే, గతంలో మృణాల్ ఠాకూర్‌కు నటుడు ధనుష్‌తో సంబంధం ఉందంటూ కూడా వార్తలు వచ్చాయి. అంతేకాకుండా ఇద్దరూ పెళ్లి చేసుకోబోతున్నారనే ప్రచారం సైతం జరిగింది. అయితే మృణాల్‌కు సన్నిహితులు ఆ వార్తలను ఖండించారు. అయితే, ప్రస్తుతం మృణాల్ యశస్వి డేటింగ్ వ్యవహారంపై అధికారికంగా ఎలాంటి స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. కేఫ్‌లో కలిసి కనిపించడం, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కామెంట్ ఆధారంగానే ఈ ప్రచారం కొనసాగుతోంది. కాబట్టి వైరల్ అవుతున్న కామెంట్‌ను మృణాల్ అధికారిక స్పందనగా భావించేందుకు ప్రస్తుతం ఆధారాలు లేవని చెప్పాలి.



# వన్డేల్లో అరుదైన రికార్డు..

## తొలి స్పిన్నర్‌గా చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్..




**స్పోర్ట్స్ డెస్క్ :**

ఆఫ్ఘనిస్తాన్ స్టార్ లెగ్ స్పిన్నర్ రషీద్ ఖాన్ వన్డే క్రికెట్‌లో మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఐర్లాండ్‌తో జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా జరిగిన రెండో మ్యాచ్‌లో అద్భుతమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్న రషీద్.. వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంతకుముందు ఏ స్పిన్నర్ సాధించని రికార్డును నెలకొల్పాడు. అతడి విధ్వంసకర బౌలింగ్‌తో ఆఫ్ఘనిస్తాన్ 92 పరుగుల తేడాతో ఐర్లాండ్‌పై ఘన విజయం సాధించింది. బ్రాడీ క్రికెట్ క్లబ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ నిర్ణీత 47 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 299 పరుగులు చేసింది. దీంతో ఐర్లాండ్ ముందు 300 పరుగుల భారీ లక్ష్యం నిలిచింది. లక్ష్య ఛేదనలో ఐర్లాండ్ బ్యాటర్లు ఆరంభంలో పోరాడే ప్రయత్నం చేసినప్పటికీ, రషీద్ ఖాన్ బంతిని అందుకున్న తర్వాత మ్యాచ్ పూర్తిగా ఆఫ్ఘనిస్తాన్ వైపు మళ్లింది.

**34 పరుగులకు 6 వికెట్లు**

రషీద్ ఖాన్ తన 10 ఓవర్ల కోటాలో కేవలం 34 పరుగులు మాత్రమే ఇచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. 15వ ఓవర్ తొలి బంతికే ఆండ్రూ బాల్బిర్నీని 36 పరుగుల వద్ద ఔట్ చేసి వికెట్ల వేట ప్రారంభించాడు. ఆ తర్వాత హ్యారీ టెక్టర్ 5, బెంజమిన్ కాలిట్జ్ 27, కర్టిస్ కాంఫర్ 23, జయ్ ముంద్రా 3, బైరన్ మెక్‌డొనా 0 పరుగుల వద్ద రషీద్ స్పిన్‌కు బలయ్యారు. రషీద్ వరుసగా వికెట్లు తీయడంతో ఐర్లాండ్ బ్యాటింగ్ ఆర్డర్ పూర్తిగా కుప్పకూలింది. చివరకు ఆతిథ్య జట్టు 33.2 ఓవర్లలో 207 పరుగులకే ఆలౌట్ అయింది. అజ్మతుల్లా ఒమర్జాయ్ రెండు వికెట్లు, ఫజల్హక్ ఫరూఖీ ఒక వికెట్ తీయడంతో ఆఫ్ఘనిస్తాన్ 92 పరుగుల భారీ విజయాన్ని అందుకుంది.

**వన్డేల్లో మూడుసార్లు 6 వికెట్లు తీసిన తొలి స్పిన్నర్**

ఈ మ్యాచ్‌లో 6 వికెట్లు తీసిన రషీద్ ఖాన్.. వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకే ఇన్నింగ్స్‌లో ఆరుకు పైగా వికెట్లు మూడుసార్లు తీసిన ప్రపంచంలోని తొలి స్పిన్నర్‌గా చరిత్ర సృష్టించాడు. రషీద్ కంటే ముందు వనిందు హసరంగా, ఇమ్రాన్ తాహిర్, షాహిద్ అఫ్రిది, అకిల ధనంజయ, సందీప్ లమిచానే, అజంతా మెండిస్ వంటి స్పిన్నర్లు రెండుసార్లు చొప్పున ఆరు వికెట్ల ప్రదర్శనలు చేశారు. ఇప్పుడు రషీద్ ఈ జాబితాలో అందరికంటే ముందంజలో నిలిచాడు. అదికూడా కేవలం 121 వన్డేల్లోనే ఈ ఘనత సాధించడం విశేషం. దీంతో వన్డే క్రికెట్‌లో రషీద్ ఖాన్ ఎంతటి ప్రభావవంతమైన బౌలర్ అనేది మరోసారి రుజువైంది.

**జింబాబ్వేపై అరంగేట్రం.. ఐర్లాండ్‌పై తొలి 6 వికెట్లు**

రషీద్ ఖాన్ 2015 అక్టోబర్ 15న జింబాబ్వేపై తన వన్డే అరంగేట్రం చేశాడు. అరంగేట్రం చేసిన సుమారు ఏడాదిన్నర తర్వాత 2017 మార్చిలో ఐర్లాండ్‌పై గ్రేటర్ నోయిడాలో జరిగిన మ్యాచ్‌లో తొలిసారి ఒక వన్డే ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీశాడు. ఆ మ్యాచ్‌లో రషీద్ 6/43 గణాంకాలు నమోదు చేశాడు. అదే ఏడాది వెస్టిండీస్‌పై రషీద్ తన కెరీర్‌లోనే అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనల్లో ఒకటి నమోదు చేశాడు. గ్రాస్ ఐస్లెట్‌లో జరిగిన మ్యాచ్‌లో కేవలం 18 పరుగులు మాత్రమే ఇచ్చి ఏకంగా 7 వికెట్లు పడగొట్టాడు. ఆ స్పెల్‌తో వెస్టిండీస్ బ్యాటింగ్‌ను రషీద్ పూర్తిగా కుదిపేశాడు.

**వకార్ యూనిస్ సరసన రషీద్**

ఒకే జట్టుపై ఒకటి కంటే ఎక్కువసార్లు ఒక ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసిన ఆటగాళ్ల జాబితాలో రషీద్ ఖాన్ ఇప్పుడు పాకిస్థాన్ మాజీ కెప్టెన్ వకార్ యూనిస్ సరసన నిలిచాడు. వకార్ న్యూజిలాండ్‌పై రెండుసార్లు ఈ ఘనత సాధించగా, రషీద్ ఐర్లాండ్‌పై రెండోసారి ఆరు వికెట్లు తీశాడు. అయితే వన్డేల్లో ఒక ఇన్నింగ్స్‌లో ఆరు లేదా అంతకంటే ఎక్కువ వికెట్లు అత్యధికసార్లు తీసిన రికార్డు మాత్రం వకార్ యూనిస్ పేరిటే ఉంది. పాకిస్థాన్ మాజీ కెప్టెన్ తన వన్డే కెరీర్‌లో ఐదుసార్లు ఈ ఘనత సాధించాడు. రషీద్ ఖాన్ ప్రస్తుతం మూడుసార్లు ఆరు వికెట్ల ప్రదర్శనతో అతని రికార్డుకు చేరువలో ఉన్నాడు.

**సిరీస్‌లో ఆఫ్ఘనిస్తాన్ ఆధిక్యం**

ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో ఆఫ్ఘనిస్తాన్ మరో కీలక విజయాన్ని నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘన్ జట్టు 299 పరుగులు చేయగా, ఐర్లాండ్ లక్ష్యాన్ని ఛేదించలేక 207 పరుగులకే ఆలౌటైంది. రషీద్ ఖాన్ స్పిన్ ముందు ఐరిష్ బ్యాటర్లు నిలబడలేకపోవడం మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించింది. ఇక, ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో మూడో వన్డే ఆగస్టు 10న బెల్‌ఫాస్ట్‌లో జరగనుంది. ఇప్పటికే అరుదైన రికార్డుతో చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్ తదుపరి మ్యాచ్‌లోనూ ఇదే జోరు కొనసాగిస్తాడా? అనేది ఆసక్తికరంగా మారింది.

## చరిత్ర సృష్టించిన కాటేరమ్మ కొడుకు..

# ఒక్క ఓటుతో సంచలన విజయం..

**స్పోర్ట్స్ డెస్క్ :**

ఆస్ట్రేలియా క్రికెట్ చరిత్రలో మరో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. ఆసీస్ విధ్వంసకర ఓపెనర్ ట్రావిస్ హెడ్ వరుసగా రెండో ఏడాది కూడా ఆస్ట్రేలియా అత్యున్నత వ్యక్తిగత క్రికెట్ పురస్కారం 'అలన్ బోర్డర్ మెడల్'ను కైవసం చేసుకున్నాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) తరపున ఆడుతున్న ఈ కాటేరమ్మకొడుకు ఆసీస్ క్రికెట్ చరిత్రలో ఈ ఘనత సాధించిన ఐదో ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఈ రేసులో తన ఆత్మీయ మిత్రుడు, వికెట్ కీపర్ బ్యాటర్ అలెక్స్ క్యారీపై కేవలం ఒక్క ఓటు స్వల్ప ఆధిక్యంతో విజయం సాధించి హెడ్ ఈ పతకాన్ని ముద్దాడాడు.

ఓ దివ్యమైన అవార్డుల ప్రదానోత్సవంలో ఆస్ట్రేలియా దిగ్గజ మాజీ కెప్టెన్ అలన్ బోర్డర్ స్వయంగా ట్రావిస్ హెడ్‌కు ఈ మెడల్‌ను ప్రధానం చేశారు. 2025 జనవరి 29 నుంచి 2026 జనవరి 8 వరకు ఉన్న ఓటింగ్ కాలంలో హెడ్ అత్యధిక ఓట్లు సాధించాడు. అలెక్స్ క్యారీ రెండో స్థానంలో నిలవగా, వేగవంతమైన బౌలర్ మిచెల్ స్టార్క్ విజేత హెడ్ కంటే



కేవలం మూడు ఓట్ల వెనుకంజలో ఉండి మూడో స్థానంలో నిలిచాడు. ఈ చారిత్రాత్మక క్షణంలో 32 ఏళ్ల హెడ్ ఎమోషనల్ అవుతూ.. “నా దగ్గర ఇప్పుడు రెండు పతకాలు ఉన్నాయనే ఆలోచనే చాలా అద్భుతంగా ఉంది. రాబోయే 20 ఏళ్లలో నా పిల్లలకు వీటిని గర్వంగా చూపించగలను. భారత్, ఇంగ్లాండ్ వంటి బలమైన జట్లపై ఆడిన కీలక సిరీస్‌లలో రాణించి ఈ రెండు పతకాలను గెలవడం నాకు చాలా ప్రత్యేకమైన అనుభూతి” అని హర్షం వ్యక్తం చేశాడు.

ఇక, ట్రావిస్ హెడ్‌కు ఈ ఏడాది అతని క్రికెట్ కెరీర్‌లోనే అత్యుత్తమ దశగా నిలిచింది. ముఖ్యంగా ఇంగ్లాండ్‌తో జరిగిన ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లో ఓపెనర్ బాధ్యతలను స్వీకరించి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. పెర్త్ టెస్టులో 123 పరుగుల పోరాట పటిమను ప్రదర్శించగా, అడిలైడ్‌లో 170 పరుగుల భారీ స్కోర్ నమోదు చేశాడు. సిడ్నీ న్యూ ఇయర్ టెస్టులో 163 పరుగుల దూకుడు ఇన్నింగ్స్‌తో జట్టుకు కొండంత అండగా నిలిచాడు. రెడ్ బాల్ క్రికెట్‌లోనే కాకుండా, వన్డేల్లోనూ తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ మెకే వేదికగా దక్షిణాఫ్రికాపై 142 పరుగుల అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. ఈ ఓటింగ్ కాలంలో టెస్టులు, వన్డేలు రెండింటిలోనూ ఆస్ట్రేలియా తరపున అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా ఈ కాటేరమ్మకొడుకు నిలిచాడు. మరోవైపు, ఈ చారిత్రాత్మక విజయంతో ట్రావిస్ హెడ్ ఆస్ట్రేలియా క్రికెట్ దిగ్గజాల సరసన చేరాడు. ఒకటి కంటే ఎక్కువసార్లు అలన్ బోర్డర్ మెడల్ గెలుచుకున్న స్టీవ్ స్మిత్, నాథన్ లయన్ వంటి దిగ్గజాల క్లబ్‌లో చోటు సంపాదించాడు. అంతేకాకుండా, వరుసగా రెండేళ్లపాటు ఈ గౌరవాన్ని అందుకున్న రికీ పాంటింగ్, మైకేల్ క్లార్క్, డేవిడ్ వార్నర్, షేన్ వాట్సన్ సరసన నిలిచాడు.



# ఫుట్‌బాల్ లెజెండ్ మెస్సీ ఇంట్లో విషాదం!

- మెస్సీ తండ్రి జార్జ్ కన్నుమూత
- అర్జెంటీనా, స్పెయిన్ మీడియా సంస్థలు వెల్లడి

**స్పోర్ట్స్ డెస్క్ :**

అర్జెంటీనా స్టార్ ఫుట్‌బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సీ ఇంట్లో విషాదం చోటుచేసుకుంది. మెస్సీ తండ్రి జార్జ్ మెస్సీ కన్నుమూశారు. 68 ఏళ్ల వయసులో శుక్రవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో తుదిశ్వాస విడిచినట్లు అర్జెంటీనా, స్పెయిన్‌కు చెందిన పలు మీడియా సంస్థలు వెల్లడించాయి. అయితే మెస్సీ కుటుంబం మాత్రం ఇప్పటివరకు అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. అర్జెంటీనాలోని మెస్సీ స్వస్థలమైన రొసారియోలో జార్జ్ మెస్సీ మృతి చెందినట్లు సమాచారం. మెస్సీ ఫుట్‌బాల్ కెరీర్‌ను తీర్చిదిద్దడంలో జార్జ్ కీలక పాత్ర పోషించారు. చిన్నతనం నుంచి తన కుమారుడి కెరీర్‌కు అండగా నిలుస్తూ.. అతడిని ప్రపంచ ఫుట్‌బాల్‌లో అగ్రస్థాయికి తీసుకెళ్లడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు.

మెస్సీ తొలిసారిగా ఆడిన క్లబ్ న్యూవెల్స్ ఓల్డ్ బాయ్స్ జార్జ్ మెస్సీ మృతిపై సోషల్ మీడియా వేదికగా సంతాపం తెలిపింది. 68 ఏళ్ల వయసులో రొసారియోలో జార్జ్ కన్నుమూశారని పేర్కొంటూ.. మెస్సీ కుటుంబానికి సానుభూతి తెలిపింది. లియోనెల్ మెస్సీ కెరీర్‌లో జార్జ్ ఒక బలమైన స్తంభంలా నిలిచారని క్లబ్ పేర్కొంది. విజన్, క్రమశిక్షణ, ఆప్యాయతతో తన కుమారుడి కెరీర్‌కు ఆయన అండగా నిలిచారని తెలిపింది. చిన్ననాటి నుంచి ప్రపంచ ఫుట్‌బాల్‌లో అత్యున్నత స్థాయికి చేరుకునే వరకు మెస్సీ ప్రతి అడుగులోనూ జార్జ్ మద్దతు కీలకంగా ఉందని పేర్కొంది. తన కుమారుడికి న్యూవెల్స్ క్లబ్ రంగులను ప్రేమించడం నేర్పినందుకు జార్జ్‌కు ధన్యవాదాలు తెలిపిన క్లబ్.. ఆయన భార్య సెలియా కుచిట్టినీ, కుమారులు లియోనెల్, రోడ్రిగో, మాటియాస్, కుమార్తె మారియా సోల్‌తో పాటు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపింది. జార్జ్ మెస్సీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ముగిసిన ఫిఫా ప్రపంచకప్ సమయంలోనే ఆయన ఆరోగ్య పరిస్థితిపై వార్తలు వెలువడ్డాయి. అర్జెంటీనా జట్టు అల్జీరియాతో ఆడిన తొలి మ్యాచ్‌లో మెస్సీ హ్యాట్రిక్ సాధించిన సమయంలో భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకోవడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో జార్జ్ ఆరోగ్యం సరిగా లేదనే ప్రచారం మొదలైంది. ఆ తర్వాత మెస్సీ కుటుంబం ఒక ప్రకటన విడుదల చేస్తూ.. జార్జ్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, చికిత్సకు సానుకూలంగా స్పందిస్తున్నారని తెలిపింది. అయితే తాజాగా ఆయన మృతి చెందినట్లు పలు అంతర్జాతీయ మీడియా సంస్థలు వెల్లడించాయి.

# ఆసీస్ క్రికెట్‌లో కలకలం..



- ఆసీస్ వైస్ కెప్టెన్ ఆష్లే గార్డనర్‌పై మాజీ భార్య మోనికా రైట్ ఆరోపణలు
- సహచర ప్లేయర్ జార్జియా వోల్‌తో గార్డనర్‌కు ఎఫైర్ ఉందని విమర్శ
- గార్డనర్‌ను వైస్ కెప్టెన్సీ నుంచి తొలగించాలని రైట్ డిమాండ్
- ఇది వ్యక్తిగత విషయమని స్పష్టం చేసిన క్రికెట్ ఆస్ట్రేలియా
- గార్డనర్‌కు అండగా నిలిచిన ఆమె బీబీఎల్ ఫ్రాంచైజీ సిడ్నీ సిక్సర్స్

**స్పోర్ట్స్ డెస్క్ :**

ఆస్ట్రేలియా మహిళా క్రికెట్‌లో పెద్ద వివాదం రాజుకుంది. గతంలో స్వలింగ వివాహం చేసుకున్న జట్టు వైస్ కెప్టెన్ ఆష్లే గార్డనర్‌పై ఆమె మాజీ భార్య మోనికా రైట్ సంచలన ఆరోపణలు చేసింది. సహచర ప్లేయర్ జార్జియా వోల్‌తో గార్డనర్‌కు వివాహేతర సంబంధం ఉందని ఆరోపించిన రైట్, ఆమెను తక్షణమే వైస్ కెప్టెన్సీ బాధ్యతల నుంచి తొలగించాలని డిమాండ్ చేసింది. ఈ వ్యవహారంలో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఎందుకు మౌనంగా ఉంటోందంటూ ఆమె ప్రశ్నించింది.

కోడ్ స్పోర్ట్స్ తో మాట్లాడిన మోనికా రైట్.. "దేశానికి ప్రాతినిధ్యం వహించే గౌరవం దక్కినప్పుడు, రోల్ మోడల్‌గా ఉన్నప్పుడు ఉన్నత నైతిక విలువలను పాటించాల్సిన బాధ్యత ఉంటుంది. ఈ విషయంలో క్రికెట్ ఆస్ట్రేలియా ఎందుకు బహిరంగంగా స్పందించడం లేదో నాకు అర్థం కావడం లేదు. వారి మౌనం ఆష్లే, జార్జియా చర్యలను సమర్థించినట్లేనా? జూనియర్ సభ్యురాలితో ఎఫైర్ పెట్టుకుని, నాయకత్వ పదవిలో ఎలా కొనసాగుతారు? కెప్టెన్లు ప్రమాణాలను నెలకొల్పాలి, కానీ ఈ ప్రవర్తన అందుకు విరుద్ధంగా ఉంది" అని రైట్ తీవ్రంగా విమర్శించింది. ఈ ఆరోపణలపై క్రికెట్ ఆస్ట్రేలియా స్పందిస్తూ.. ఇది 'వ్యక్తిగత విషయం' అని పేర్కొంది. "మా సిబ్బంది మధ్య అన్ని సంబంధాలు మా 'రెస్పెక్ట్ ఎట్ వర్క్' పాలసీకి అనుగుణంగా ఉండేలా చూసుకుంటాం. నాయకత్వ బాధ్యతలకు మద్దతుగా, జట్టు ప్రక్రియల సమగ్రతను కాపాడటానికి అవసరమైన కాన్ఫ్లిక్ట్ఆఫ్ఇంటరెస్ట్ ఏర్పాట్లు కూడా ఇందులో భాగంగా ఉంటాయి" అని సీఏ ఒక ప్రకటనలో తెలిపింది. డైలీ మెయిల్' కథనం ప్రకారం.. ఆష్లే గార్డనర్, మోనికా రైట్‌లకు 2025 ఏప్రిల్ లో స్వలింగ వివాహం జరిగింది. 2025లో భారత్‌లో జరిగిన మహిళల వన్డే ప్రపంచకప్ సమయంలో గార్డనర్, జార్జియా వోల్‌తో సంబంధం పెట్టుకుందని రైట్ ఆరోపించడంతో వీరి బంధం దెబ్బతింది. అప్పటి నుంచి వీరిద్దరూ విడిపోయారు.

ఈ వివాదం నడుమ గార్డనర్‌కు ఆమె ఉమెన్స్ బిగ్ బాష్ లీగ్ (డబ్ల్యూబీబీఎల్) ఫ్రాంచైజీ సిడ్నీ సిక్సర్స్ మద్దతుగా నిలిచింది. సిక్సర్స్ జీఎం, ఆస్ట్రేలియా మాజీ ప్లేయర్ రాచెల్ హేన్స్ మాట్లాడుతూ.. "ఆమె వ్యక్తిగత జీవితంపై నేను వ్యాఖ్యానించను. నేను ఆమెతో టచ్‌లో ఉన్నాను. మేము ఆమెకు మద్దతుగా ఇక్కడ ఉన్నామని ఆమెకు తెలుసు. మా క్లబ్‌లో ఆమె ఒక ముఖ్యమైన, గౌరవనీయమైన క్రీడాకారిణి" అని తెలిపింది.

# పంత్ రిక్వెస్ట్ కు స్పందించిన సీఎం పుష్కర్ సింగ్ ధామి..

- ఉత్తరాఖండ్‌లో భూమి కొనుగోలుకు సాయం చేయాలని సీఎంను కోరిన పంత్
- గత మూడేళ్లుగా ప్రయత్నిస్తున్నా ప్రక్రియలో స్పష్టత లేదని ఆవేదన
- పంత్ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన సీఎం
- నిబంధనల ప్రకారం పూర్తి సహకారం అందించాలని అధికారులకు ఆదేశం
- భూమిని ప్రభుత్వ ధరలకే కొంటానని స్పష్టం చేసిన క్రికెటర్



భారత క్రికెట్ జట్టు వికెట్ కీపర్‌బ్యాటర్ రిషబ్ పంత్ తన స్వరాష్ట్రమైన ఉత్తరాఖండ్‌లో భూమి కొనుగోలు చేసేందుకు సహాయం చేయాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామిని సోషల్ మీడియా వేదికగా కోరాడు. పంత్ విజ్ఞప్తిపై సీఎం సానుకూలంగా స్పందించి, పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఈ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రస్తుతం శ్రీలంక పర్యటనలో ఉన్న రిషబ్ పంత్, తాను ఢిల్లీ నుంచి తన సొంత రాష్ట్రానికి మకాం మార్చి, తన మొదటి ఇల్లు కట్టుకోవాలనుకుంటున్నట్లు 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో పోస్ట్ చేశాడు. "గత మూడేళ్లుగా సరైన స్థలం కోసం ప్రయత్నిస్తున్నాను. కానీ ఈ ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు, స్పష్టత లేకపోవడం ఒక పీడకలలా మారింది. నా పహాడీ ప్రజల మధ్య జీవించాలని, రాష్ట్రానికి సేవ చేయాలని ఉంది" అని పేర్కొంటూ సీఎం సహాయాన్ని అభ్యర్థించాడు. అయితే, మరో పోస్ట్‌లో పంత్ ఒక స్పష్టత ఇచ్చాడు. అంతర్జాతీయంగా రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించినందుకు బహుమతిగా భూమి ఇస్తే సంతోషమే అయినా, తాను మాత్రం ప్రభుత్వ నిబంధనల ప్రకారం వర్తించే ధరలకే భూమిని కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు తెలిపాడు. పంత్ పోస్ట్‌పై సీఎం పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. 'రిషబ్ పంత్ ఉత్తరాఖండ్ గర్వకారణం' అని ప్రశంసించారు. నిబంధనల ప్రకారం అన్ని విధాలా సహకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించామని, వారు త్వరలోనే పంత్‌ను సంప్రదిస్తారని ఆయన బదులిచ్చారు. "ప్రియమైన రిషబ్.. మీరు ఉత్తరాఖండ్‌కు గర్వకారణం. మీ అద్భుతమైన ప్రదర్శన, విజయాలతో మీరు దేశంలో, ప్రపంచంలో దేవభూమి పేరును ప్రకాశింపజేశారు. మీ మాతృభూమిపై మీకున్న ప్రేమ, ఇక్కడికి తిరిగి వచ్చి సేవ చేయాలనే మీ ఆకాంక్ష ఎంతో ప్రశంసనీయం. మీరు లేవనెత్తిన విషయానికి సంబంధించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. వారు త్వరలో మిమ్మల్ని సంప్రదించి, నిబంధనల ప్రకారం సహకారం అందిస్తారు" అని సీఎం ధామి ట్వీట్ చేశారు.

## కొరియా మాస్టర్స్ ఫైనల్‌కు అస్మిత చాలిహా

**'స్పోర్ట్స్ డెస్క్ :**

భారత యువ షట్లర్ అస్మిత చాలిహా (Ashmita Chaliha) అదరగొట్టేస్తోంది. తన తొలి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ టోర్నీలో ఫైనల్‌కు చేరుకుంది. కొరియా మాస్టర్స్ 300లో మరో భారత షట్లర్ రక్షిత రామరాజ్‌పై అస్మిత విజయం సాధించింది. చివరి గేమ్ వరకూ వెళ్లిన పోరులో అస్మిత 2113, 1621, 2113 తేడాతో రక్షితపై గెలిచింది. దాదాపు మూడు నెలలపాటు ఆటకు దూరమైన 26 ఏళ్ల అస్మిత గత మేలోనే మైదానంలోకి దిగింది. ప్రతి మ్యాచ్‌లోనూ అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు చేరుకుంది. చైనా షట్లర్ కియాన్సి హాన్ ఫైనల్‌కు దూసుకొచ్చింది. మరో సెమీస్‌లో హాన్ 2220, 1821, 2114 తేడాతో కొరియా ప్లేయర్ గ్రేస్ కిమ్‌పై విజయం సాధించింది. దీంతో ఆదివారం జరగనున్న ఫైనల్‌లో భారత షట్లర్ అస్మితతో హాన్ టైటిల్ కోసం తలపడనుంది.




# 12న ఇరుముడి ట్రైలర్ విడుదలకు సన్నాహాలు

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ఇరుముడి' ట్రైలర్‌ను ఆగస్టు 12న విడుదల చేయనున్నారు. భీమవరంలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. 'నిన్ను కోరి', 'టక్ జగదీష్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న శివ నిర్వాణ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు సినిమాకు సంబంధించి విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్‌ను అందుకున్నాయి. ముఖ్యంగా కుటుంబ కథాంశానికి భక్తి అంశాలను జోడించి సినిమాను రూపొందిస్తున్నట్లు తెలుస్తుండటంతో 'ఇరుముడి'పై అంచనాలు మరింత పెరిగాయి. ట్రైలర్ విడుదల కార్యక్రమానికి చిత్ర బృందంతో పాటు అభిమానులు, సినీ ప్రేక్షకులు భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే 'ఇరుముడి' నుంచి వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై పాజిటివ్ వైబ్స్‌ను తీసుకొచ్చింది. దీంతో ట్రైలర్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. కుటుంబ భావోద్వేగాలు, భక్తి అంశాలతో పాటు రవితేజకు సంబంధించిన మాస్ ఎలివేషన్స్‌ను ట్రైలర్‌లో ఎలా చూపించారనేది ఆసక్తికరంగా మారింది. ట్రైలర్ కూడా ప్రేక్షకులను మెప్పిస్తే సినిమా విడుదలకు ముందే హైప్ మరింత పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రవితేజను శివ నిర్వాణ ఏ తరహా పాత్రలో చూపించారనే విషయం ట్రైలర్ ద్వారా స్పష్టత వచ్చే అవకాశం ఉందని అభిమానులు భావిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తున్నారు. రవితేజ కుమార్తె పాత్రలో బేబీ నక్షత్ర కనిపించనుంది. కుటుంబ బంధాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఉన్న కథలో ఈ తండ్రీకూతుళ్ల బంధం కీలకంగా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. మాస్ మహారాజా ఇమేజ్‌కు భిన్నంగా కుటుంబ భావోద్వేగాలను, భక్తి అంశాలను కలగలిపి శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. దీంతో 'ఇరుముడి' రవితేజ కెరీర్‌లో మరో విభిన్నమైన సినిమాగా నిలుస్తుందా అన్న ఆసక్తి నెలకొంది. కాగా 'ఇరుముడి' ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# రామాయణ తొలుత విదేశాల్లో విడుదల




రామాయణం ఇతిహాసం ఆధారంగా తెరకెక్కుతోన్న ప్రతిష్టాత్మక చిత్రం 'రామాయణ' ప్రపంచవ్యాప్త విడుదలపై నిర్మాత నమిత్ మల్హోత్రా కీలక ప్రకటన చేశారు. ఈ సినిమాను అంతర్జాతీయ మార్కెట్‌లో ముందుగా.. ఆ తర్వాత భారత్‌లో విడుదల చేసేలా వినూత్న వ్యూహాన్ని అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాతో ఆయన మాట్లాడారు. నవంబర్ 6న విదేశాల్లో 'రామాయణ' విడుదల చేస్తున్నాం. విదేశీ మార్కెట్లలో సినిమాల విడుదల సాధారణంగా శుక్రవారం నుంచే ప్రారంభమవుతుంది. ఇండియాలో మాత్రం దీపావళి నవంబర్ 8 రోజే విడుదల చేస్తాం అని చెప్పారు. దిగ్గజ దర్శకుడు నితీశ్ తివారీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ భారీ బ్జడెట్ దృశ్యకావ్యంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణాసురుడిగా యష్, హనుమంతుడిగా సన్నీ దేవోల్, లక్ష్మణుడిగా రవి దూబే నటిస్తున్నారు. ఆస్కార్ విజేతలు ఏ.ఆర్. రెహమాన్, హన్స్ జిమ్మర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇండియాలో ధర్మ ప్రొడక్షన్స్ ఈ చిత్రాన్ని పంపిణీ చేస్తుండగా, ఓవర్సీస్ హక్కులను సోనీ పిక్చర్స్ దక్కించుకుంది. సంగీత హక్కులను టీ-సిరీస్ రూ. 75 కోట్లకు సొంతం చేసుకున్నట్లు సమాచారం.


# త్రివిక్రమ్‌తో మా బంధం బలమైనది

## సూర్యదేవర నాగవంశీ వెల్లడి

ఒక బ్యానర్‌లో పనిచేసే వ్యక్తుల మధ్య మంచి అనుబంధం ఏర్పడితే.. అదే బంధం కొనసాగుతుందని, దానికి ప్రత్యేకమైన అగ్రిమెంట్లు అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నాగవంశీ.. నిర్మాతల కాంపౌండ్స్, దర్శకుడు త్రివిక్రమ్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో వారి కుటుంబానికి ఉన్న అనుబంధం గురించి నాగవంశీ మాట్లాడుతూ.. తన బాబాయి (చిన్నబాబు) ఇండస్ట్రీలోకి రావాలని అనుకున్న సమయంలో తొలి సినిమాను త్రివిక్రమ్ దర్శకత్వంలోనే చేయాలని కోరుకున్నారని తెలిపారు. త్రివిక్రమ్ పనితీరు, సినిమాలపై ఆయనకు ఉన్న అభిమానం కారణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఆ సమయంలో 'జులాయి' సినిమా ప్రారంభమైనప్పటి నుంచి త్రివిక్రమ్‌తో తమ అనుబంధం మరింత బలపడిందని నాగవంశీ పేర్కొన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' అనే బ్యానర్ పేరును కూడా త్రివిక్రమే సూచించారని, ఆ బ్యానర్ లోగోను సైతం ఆయనే డిజైన్ చేశారని వెల్లడించారు. 'అప్పటి నుంచి ఇప్పటివరకు త్రివిక్రమ్ బయట బ్యానర్‌లో సినిమా చేయలేదు. దీనికి ఎలాంటి అగ్రిమెంట్లు లేవు. మా మధ్య ఉన్న రిలేషన్‌షిప్ అలాంటిది. ఒక ఫ్యామిలీలా అయిపోయాం' అని నాగవంశీ చెప్పుకొచ్చారు. త్రివిక్రమ్ తమ బ్యానర్‌తోనే వరుసగా సినిమాలు చేస్తూ ప్రయాణం కొనసాగిస్తున్న నేపథ్యంలో.. తమ వైపు నుంచి కూడా ఆయనకు ఎక్స్‌క్లూజివిటీ ఇవ్వడం సహజమేనని నాగవంశీ అన్నారు. 'హారిక అండ్ హాసిని క్రియేషన్స్' బ్యానర్‌ను ప్రధానంగా త్రివిక్రమ్ సినిమాల కోసం కొనసాగిస్తున్నట్లు వివరించారు. అయితే త్రివిక్రమ్‌కు ఆ బ్యానర్‌లో వాటా ఉందనే ప్రచారంపై కూడా నాగవంశీ క్లారిటీ ఇచ్చారు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్‌లో త్రివిక్రమ్‌కు ఎలాంటి షేర్ లేదని, ఆయనకు రెమ్యునరేషన్ మాత్రమే ఉంటుందని స్పష్టం చేశారు. ఆయనకు సంబంధించిన షేర్ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో ఉంటుందని తెలిపారు. అలాగే సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌కు సంబంధించిన ప్రాజెక్టుల్లో త్రివిక్రమ్ కీలకంగా భాగస్వామ్యం అవుతున్నారని, స్క్రిప్టులు, ఇతర సినిమా విషయాల్లో ఆయన సలహాలు కూడా తీసుకుంటామని నాగవంశీ వెల్లడించారు. త్రివిక్రమ్‌తో తమ బంధం కేవలం సినిమాలకు సంబంధించినది మాత్రమే కాదని.. సంవత్సరాలుగా కొనసాగుతున్న అనుబంధమే తమ ప్రయాణానికి కారణమని నాగవంశీ చెప్పుకొచ్చారు.



# 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో ది ఒడిస్సీ



హాలీవుడ్ ప్రముఖ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన తాజా విజువల్ వండర్ 'ది ఒడిస్సీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. థియేటర్లలో విడుదలైన మూడు వారాల్లోనే ఈ ఫాంటసీ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా 1 బిలియన్ కలెక్షన్ల క్లబ్‌లో (దాదాపు రూ. 9,500 కోట్లకు పైగా) అడుగుపెట్టింది క్రిస్టోఫర్ నోలన్ కెరీర్‌లో 1 బిలియన్ మార్కును అందుకున్న మూడో చిత్రంగా 'ది ఒడిస్సీ' నిలిచింది. అంతకుముందు ఆయన దర్శకత్వం వహించిన 'ది డార్క్ నైట్' (1.008 బిలియన్), 'ది డార్క్ నైట్ రైజెస్' (1.08 బిలియన్) ఈ ఘనత సాధించాయి. గతేడాది వచ్చిన 'ఓపెన్‌హైమర్' ఈ మార్కుకు కాస్త దూరంలో ఆగిపోయింది. కాగా, ఈ వీకెండ్ ముగిసేసరికి 'ది ఒడిస్సీ' నోలన్ కెరీర్‌లోనే అత్యధిక కలెక్షన్లు సాధించిన చిత్రంగా నిలవడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక్క ఐమాక్స్ స్క్రీన్ల నుంచే ఏకంగా 257 మిలియన్ డాలర్ల వసూళ్లు (దాదాపు రూ. 2,445 కోట్లు) రావడం విశేషం. త్వరలోనే ఐమాక్స్ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగానూ ఇది నిలవనుంది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్ అయిన చైనాలో ఈ సినిమా విడుదల కావాల్సి ఉంది. చైనా వ్యాప్తంగా దాదాపు 800 ఐమాక్స్ స్క్రీన్లతో పాటు వేలాది సాధారణ స్క్రీన్లలో అత్యంత భారీ స్థాయిలో విడుదల చేయడానికి మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు. దీంతో ఈ సినిమా మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయంగా కనిపిస్తోంది.

# కొరియన్ కనకరాజుతో హిట్ కొట్టిన వరుణ్ తేజ్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్‌కు గత కొంతకాలంగా హిట్ కోసం ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'కొరియన్ కనకరాజు' వరుణ్ తేజ్‌కు భారీ ఊరటనిచ్చేలా బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ హారర్ కామెడీ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితిక నాయక్ హీరోయిన్‌గా నటించింది. సత్య కీలక పాత్రలో కనిపించారు. విడుదలకు ముందు నుంచే మంచి బజ్‌ను సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం 'కొరియన్ కనకరాజు' ప్రీమియర్స్, తొలి రోజు కలిపి రూ. 10.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. హారర్ కామెడీ జోనర్‌లో తెరకెక్కిన సినిమాకు ఇది మంచి ఓపెనింగ్‌గా చెప్పొచ్చు. అంతేకాదు.. వరుణ్ తేజ్ కెరీర్‌లో ఇదే బిగ్గెస్ట్ ఓపెనర్గా నిలిచినట్లు మేకర్స్ వెల్లడించారు. గతంలో వరుణ్ తేజ్‌కు అత్యధిక ఓపెనింగ్ అందించిన 'గద్దలకొండ గణేళిష్' సినిమాను 'కొరియన్ కనకరాజు' అధిగమించింది. దీంతో చాలా కాలం తర్వాత వరుణ్ తేజ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. దేశీయ మార్కెట్‌తో పాటు ఓవర్సీస్‌లోనూ సినిమా మంచి ఆరంభాన్ని అందుకుంది. ముఖ్యంగా అమెరికాలో ఇప్పటివరకు 1.75 లక్షల డాలర్ల గ్రాస్ సాధించినట్లు సమాచారం. సినిమా థియేట్రికల్ రైట్స్‌కు అనుగుణంగా చూస్తే ఇదే ట్రెండ్‌ను కొనసాగిస్తే బ్రేక్ ఈవెన్ దిశగా వెళ్లే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విడుదలకు ముందే అడ్వాన్స్ బుకింగ్స్‌లో కూడా 'కొరియన్ కనకరాజు' మంచి జోరు చూపించింది. బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్‌లలో కలిపి 2.5 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు చిత్ర బృందం వెల్లడించింది. తొలి రోజు వసూళ్లతో పాటు సినిమాకు వస్తున్న మౌత్ టాక్ కూడా పాజిటివ్‌గా ఉండటం మేకర్స్‌కు మరింత కలిసొచ్చే అంశంగా మారింది.

Printed, Published and Owned by V SAMPATH, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146 Email: shenarthimedia@gmail.com. Phone No: 9391343644